

ఎయిర్‌పోర్టులో 15 డిగ్రీలు



విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం కూడా చలి తీవ్రత కొనసాగింది. ఒడిశా నుంచి వీస్తున్న అతి శీతలగాలులు ఏజెన్సీ మీదుగా నగరం వరకూ విస్తరించాయి. దీనికితోడు తెల్లవారుజాము నుంచి దట్టంగా మంచు కురిసింది. బుధవారం ఎయిర్‌పోర్టులో 15 డిగ్రీలు (సాధారణం కంటే నాలుగు డిగ్రీలు తక్కువ) కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

టైటిల్ డీడ్ తాకట్టు!

ముంబై వ్యాపారికి లబ్ధి చేకూర్చేందుకు అడ్డగోలుగా వ్యవహరించిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ అధికారులు

- ఆయన దివాలా తీయడంతో సరఫాసీ చట్టం కింద బ్యాంకు నోటీసు
- వేలం వేసుకొని డబ్బు రాబట్టుకునే హక్కు
- తెలియకుండా హక్కులు ఎవరికీ బదిలీ చేయవద్దని హుకుం
- విశ్వాసం లేని అధికారికి విచారణ బాధ్యతలపై అనుమానం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ సెంట్రల్ షాపింగ్ మాల్ కోసం స్థలాన్ని లీజుకు ఇచ్చిన 'ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్' (సూపర్ బజార్) యాజమాన్యం సరిదిద్దుకోలేని తప్పులు చేసింది. ఆ స్థలంపై బ్యాంకు రుణం తీసుకోవడానికి లీజుదారులైన సుహానీ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకు యాజమాన్య హక్కులు (టైటిల్ డీడ్) పత్రాలను ఇచ్చేసింది. ఎవరిని అడిగి కో-ఆపరేటివ్ అధికారులు ఈ పని చేశారు?, ఏ ప్రయోజనాల ఆశించి చేశారు?...అనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. ఆ పత్రాలను తనఖా పెట్టి ఆ సంస్థ యాజమాని కిశోర్ బియానీ రూ.350 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ తరువాత దివాలా తీయడంతో రుణంలో సుమారు రూ.129.62 కోట్లు బకాయిగా ఉండిపోయింది. ఆ మొత్తం రాబట్టుకోవడానికి ఆర్‌బీఎల్ బ్యాంకు అనేక ప్రయత్నాలు చేసింది.

లీజు స్థలంలో నిర్మించిన షాపింగ్ మాల్



కిశోర్ బియానీకి సెంట్రల్ గ్రూపు షాపింగ్ మాల్స్‌తో పాటు బిగ్ బజార్ చైన్ మార్కెట్లు దేశ వ్యాప్తంగా ఉన్నాయి. కరోనా తరువాత అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థల బిజినెస్ ఊపందుకోవడంతో ఆయన వ్యాపారాలు ... మిగతా 4వ పేజీలో

సూపర్ బజార్ స్థలం తనఖాపై కలెక్టర్ ఆరా



- నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశం
- లీజుదారుడు, అందుకు సహకరించిన నాటి సూపర్‌బజార్ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సూపర్‌బజార్‌కు చెందిన స్థలాన్ని బ్యాంకులో కుదువబెట్టిన వ్యవహారంపై కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆరా తీశారు. అసలేమి జరిగిందో నివేదిక సమర్పించాల్సిందిగా సూపర్‌బజార్ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను, జిల్లా సహకార అధికారిని కోరారు. లీజుకు తీసుకున్న స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టడంతో ఇప్పుడు రూ.129 కోట్ల రుణ భారం సూపర్ బజార్ నెత్తిన పడింది. ఈ వ్యవహారంపై సహకార శాఖ విచారణ ప్రారంభించింది. ప్రభుత్వ పరిధిలో గల ఒక సంస్థ నుంచి లీజుకు తీసుకున్న స్థలాన్ని బ్యాంకులో కుదువబెట్టిన సుహాని సంస్థపైనా, అందుకు సంబంధించి 2018-19లో సంతకాలు చేసిన సూపర్‌బజార్ అధికారులపైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రస్తుత అధికారులను జిల్లా యంత్రాంగం ఆదేశించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి కోర్టులో కూడా కేసు దాఖలు చేశారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు చెక్

అందుబాటులోకి ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్

- ఇకపై పక్కాగా డ్రైవింగ్ చేయగలిగిన వారికే లైసెన్స్
- ప్రతిరోజూ సగటున 200 మందికి పరీక్షలు
- పది శాతానికి మించని ఉత్తీర్ణులు
- గతంలో 50 శాతం మంది పాస్!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ ఇకపై మరింత పారదర్శకంగా జరగనున్నది. రవాణా శాఖ అధికారులు, సిబ్బంది ప్రమేయం లేకుండా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించేలా ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. ఇకపై డ్రైవింగ్ పక్కాగా చేయగలిగితేనే లైసెన్స్ జారీ అవుతుంది.



ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌పై వాహనం నడుపుతున్న యువతి

జిల్లాలో ప్రతిరోజూ సగటున 200 మంది డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లో స్లాట్‌లు బుక్ చేసుకుంటారు. వారంతా గంభీరంలోని రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారుల సమక్షంలో వాహనాలను నడపాల్సి ఉంటుంది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం వాహనం నడిపేవారికి అధికారులు డ్రైవింగ్ లైసెన్స్ జారీచేసేలా సిఫారసు చేస్తుంటారు. ఒకవేళ వాహనం సరిగా నడపలేకపోతే లైసెన్స్ జారీకి నిరాకరిస్తారు. అలాంటి వారంతా మరోసారి ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకుని మళ్లీ డ్రైవింగ్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ అంతా ఇంతవరకూ మాన్యువల్‌గా జరగడంతో అధికారుల ఇష్టానుసారం లైసెన్స్ జారీ అయ్యేది. దళారులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సిఫారసు ఉంటే డ్రైవింగ్ పరీక్ష లేకుండానే లైసెన్స్‌లు జారీ చేస్తుండేవారనే ఆరోపణలు ఉన్నాయి. సరిగా వాహనం నడపడం రాని వారికి లైసెన్స్‌లు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు జరుగుతున్నాయనే వాదన ఎప్పటినుంచో ఉంది. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకే ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అందుబాటులోకి తేవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. గంభీరంలోని ... మిగతా 4వ పేజీలో



చినముషిడివాడ అయాన్ డిజిటల్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ (తొలి సెషన్) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు నాలుగు వేల మందికిగాను సుమారు 3,600 మంది హాజరయ్యారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం మూడు నుంచి ఆరు గంటల వరకు పరీక్షలు జరిగాయి. చినముషిడివాడ, షీలానగర్ పరీక్షా కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు. ఉదయం పరీక్షకు 8.30, మధ్యాహ్నం 2.30 గంటల తరువాత వచ్చిన అభ్యర్థులను పరీక్షల హాలులోకి అనుమతించబోమని సిటీ కో-ఆర్డినేటర్, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీబాయి పేర్కొన్నారు. నిబంధనలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

94.6% మందికి గ్యాస్ సబ్సిడీ

- 3,49,633 మందికి రూ.27.73 కోట్లు జమ

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి తొలివిడత సబ్సిడీని 94.6 శాతం మంది వినియోగించుకున్నారు. జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులు ఉండగా, అందులో 3,76,924 మంది ఉచిత గ్యాస్ సిలిండర్లు తీసుకునేందుకు అర్హులుగా నిర్ధారించారు. వీరంతా 2025 మార్చి నెలాఖరులోగా తొలివిడత సబ్సిడీ వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. బుధవారం వరకూ 3,56,881 మందికి సిలిండర్లు డెలివరీ చేయగా, వారిలో 3,47,091 మందికి సబ్సిడీ కింద రూ.27.73 కోట్లు ... మిగతా 4వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి



మృతిచెందిన గొర్లె మన్మథరావు (ఫైల్ ఫొటో)



అరుణకుమారి (ఫైల్ ఫొటో)

... మెయిన్ 7లో

ఏయూ వీసీ ఎంపిక ప్రక్రియ కొలిక్కి?

ముగ్గురు ఐఐటీ ప్రొఫెసర్ల పేర్లు సిఫారసు చేసిన సెర్చ్ కమిటీ

- ముంబై ఐఐటీ ప్రొఫెసర్‌కు చాన్స్?
- సీఎం దావోస్ పర్యటన అనంతరం ప్రకటనకు అవకాశం
- అనూహ్య పరిణామాలేవైనా చోటుచేసుకుంటే తప్ప దాదాపు ఆ ముగ్గురిలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి ఉప కులపతి నియామకం ప్రక్రియ దాదాపు ఒక కొలిక్కివచ్చినట్టు తెలిసింది. వీసీ ఎంపిక కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైంది. గడిచిన వారం సమావేశమైన కమిటీ...వీసీ పోస్టు కోసం మూడు పేర్లు ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఇందులో ఒకరిని వీసీగా నియమించే అవకాశం ఉంది. సెర్చ్ కమిటీ ఎంపిక చేసిన మూడు పేర్లు ఐఐటీల్లో సీనియర్ ప్రొఫెసర్లవిగా చెబుతున్నారు. ఈ ముగ్గురిలో ఒకరి పేరును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసి గవర్నర్‌కు పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌లు ప్రస్తుతం దావోస్ పర్యటనలో ఉన్నారు. ఆ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే సీఎం వద్దకు ఈ ముగ్గురి పేర్లతో కూడిన ఫైల్ వెళుతుంది. వారిలో ఒకరిని ఎంపిక చేసి గవర్నర్‌కు పంపించే అవకాశం ఉందని చెబుతున్నారు. అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఖరారు చేయడం దాదాపు ఖాయమని అంటున్నారు. ముగ్గురిలో ముంబై ఐఐటీలో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్ పేరును ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకున్నట్టు చెబుతున్నారు.

300 మందికిపైగా దరఖాస్తు

ఏయూ వీసీ పోస్టు కోసం సుమారు 300 మందికిపైగా ప్రొఫెసర్లు దరఖాస్తు చేసు కున్నారు. అందులో ఏయూలోని వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లతో పాటు రిటైర్డ్ ప్రొఫెసర్లు, రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు చెందిన ... మిగతా 4వ పేజీలో

ప్రజా భాగస్వామ్యంతోనే చెరువుల అభివృద్ధి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు

భీమునిపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా భాగస్వామ్యంతోనే చెరువుల సంరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 4వ వార్డు కాపులుప్పాడ పోతినవారి చెరువు వద్ద వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, థాన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సీఎఎస్‌సీఏడీఈఎస్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణీకరణ వల్ల అనేక చెరువులు కనుమరుగు కావడంతో పాటు చెత్తతో నిండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ప్రజా భాగస్వామ్యంతోనే చెరువులను రక్షించుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో చెరువులను కాపాడుకోవడం ఎంతో కీలకమన్నారు. కాపులుప్పాడలో గొలుసుకట్టు చెరువులుగా ప్రసిద్ధి చెందిన పోతినవారి చెరువు,బాడ చెరువు, కంబాల చెరువు, బారువ చెరువు పునరుద్ధరణకు కాస్కేడ్ ప్రాజెక్టు సంకల్పించడం అభినందనీయమని కొనియాడారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అంకితభావంతో నీటి స్థిరీకరణతో గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేసి వచ్చే జూన్ నాటికి నీరందించేలా చర్యలు చేపట్టిందన్నారు. దీని వల్ల రైతులు ఏడాదిలో రెండు పంటలు వేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఈప్రాజెక్టును అత్యంత తక్కువ బడ్జెట్‌తో అధిక ప్రయోజనాలు పొందేలా రూపొందించామని తెలిపారు.కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజనీరు బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీరు మధుసూదన్, జడ్పీ ప్రేమ ప్రసన్న వాణి, 4వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నరసింగరావు, కాపులుప్పాడ తెలుగు రైతు అధ్యక్షుడు బోర బంగారురెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాధా కుమారి, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సూరాడ రవి, కింగ్, సాంబ, రాంబాబు, వెంకటేశ్, సురేశ్‌రెడ్డి, రామానాయుడు, పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి

తగరపువలస, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడంలో గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎంతో గొప్పదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బుధవారం తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో గిడుగు వర్థంతి నిర్వహించారు. హెచ్ఎం అప్పలరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు బుధవారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు 600 మందికి గాను 408 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు,పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఎస్ఐలు లక్ష్మీ, మన్మథరావు, రామకృష్ణారావు పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్ చేస్తారని అనంతరం, నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు పూర్తి కావడంతో అభినందన సభ ఉంటుందన్నారు.



బహిరంగ వేలం నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

సింహగిరిపై వ్యాపారాల నిర్వహణకు వేలం

సింహాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలు వ్యాపారాలు చేసుకునేందుకు నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా స్వామివారి ఖజానాకు రూ.31.5 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశాల మేరకు ఈఓ కార్యాలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి పర్యవేక్షణలో బుధవారం వేలం నిర్వహించారు. కొండదిగువ తొలిపావంచా వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్న కొబ్బరి ముక్కలను పోగుచేసుకునేందుకు నిర్వహించిన వేలం ద్వారా రూ.30,60,999 లభించగా, సత్రంలోని మూడు షాపులకు జరిగిన వేలం ద్వారా నెలకు రూ.2500 అద్దె చొప్పున రూ.90 వేలు లభించింది. కార్యక్రమంలో ఏఈఓ పిళ్లా శ్రీనివాస్, పర్యవేక్షణాధికారులు నరసింహరాజు, ప్రసన్న లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

సింహాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవల తరువాత యజ్ఞ పురుషుడుగా సుదర్శన పెరుమాళ్‌ను వేదికపై అధిష్ఠింపజేశారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో బింబారాధన, కలశారాధన, మండపారాధన జరిపారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చన జరిపి, ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్టాపన చేశారు. పండితులు తొలుత పంచ సూక్తాలతో, అనంతరం సుదర్శన, నారసింహ మూల, మూర్తి మంత్రాలతో హవనాన్ని జరిపారు. ప్రధాన కలశంతో బేడా మండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలో స్వామివారి వద్ద ఉంచి పూజలు చేసిన పుణ్య జలాలతో భక్తులను ప్రోక్షణ కావించారు. శాస్త్ర విధానంలో మహాపూర్ణాహుతి చేసి భక్తులకు యజ్ఞప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈఓ నక్కాన ఆనందకుమార్, తది తరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో 108 వాహనం బోల్తా

నలుగురికి గాయాలు



వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెందుర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సరిపల్లి జాతీయ రహదారి పరిధిలోని వంతెన వద్ద బుధవారం రాత్రి 108 వాహనం బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... నర్సీపట్నంకు చెందిన చంద్రమ్మ (70) కి శ్వాసకోశ సమస్య తలెత్తడంతో ఆమె ఇద్దరు కుమారులు పెద్దిరాజు, సూరిబాబు, కోడలు లక్ష్మి 108 వాహనంలో ఆరిలోవలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువస్తుండగా సరిపల్లి వంతెన వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చంద్రమ్మకు తీవ్ర గాయాలు కాగా ఇద్దరు కుమారులు, కోడలికి స్వల్ప గాయాలయ్యా యి. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను మరో వాహనం లో ఆస్పత్రికి తరలించారు.

భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మహిళలను ఆహార నాణ్యత గురించి అడుగుతున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌లో ఆహార నాణ్యతలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం ఆయన 5వ వార్డులోని మారికవలసలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ప్రతిరోజూ ఎంతమంది భోజనం చేస్తున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకుని, రికార్డులు పరిశీలించారు. మిగిలిన భోజనాన్ని ఏమి చేస్తున్నారని సూపర్‌వైజర్‌ను ప్రశ్నించగా దగ్గరలో ఉన్న మరో అన్నా క్యాంటీన్‌కు తరలిస్తున్నామని చెప్పారు. అనంతరం భోజనం చేసి, అన్నం సరిగ్గా ఉడకక పోవడంతో సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ ఉద్యోగులు కొంతమంది ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, బోయి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్న శ్రీనును కలిసిన వైసీపీ నాయకులు

కొమ్మాది, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును 5,7 వార్డుల వైసీపీ నాయకులు బుధవారం విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసారు. ఈసందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పని చేసి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతు, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, చేకూరి రజనీ, పిళ్లా సూరిబాబు, పెదబాబు, పోతిన మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల నిర్వాకంతో మత్స్యసంపద నాశనం



విలేకరులతో మాట్లాడుతున్న మత్స్యకార నాయకులు

తగరపువలస, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భీమిలి తీరంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల సముద్రం నీరు కలుషితమైన మత్స్య సంపద నాశనమవుతుందని రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం నాయకులు ఆరోపించారు. బుధవారం వారు తగరపువలసలో విలేకరులతో మాట్లాడారు. చిప్పాడ వద్ద దివీస్ కర్మాగారం ఏర్పాటు చేయడం వల్ల యాజమాన్యం పరిశ్రమ కలుషిత నీటిని, వ్యర్థాలను సముద్రంలోకి వదిలివేస్తున్నారని, దీనివల్ల చేపలు చనిపోతున్నాయని చెప్పారు. వేట కోసం సముద్రంలో ఎంతో దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇటీవల పరిశ్రమల కాలుష్యం వల్ల ఎన్నో తాబేళ్లు చనిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తరువాత సముద్రంలోకి విడిచిపెట్టాల్సి ఉండగా నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్నారు. అన్నవరం తీరంలో మత్స్యకారులు ఎన్నో ఏళ్లుగా తమ ఆధీనంలో ఉంచుకున్న భూమిని దివీస్ యాజమాన్యం గోడ కట్టి ఎవరూ లోపలికి వెళ్లకుండా అడ్డంకులు కల్పించారని తెలిపారు. స్థానికంగా మత్స్యకారులకు ఉపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. విలేకరులతో మాట్లాడిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లిపల్లి ఎల్లాజీ, నాయకులు ధనలక్ష్మి, శ్రీనివాస్ ఉన్నారు.

రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ బృందం

భీమునిపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్ మంగమారిపేట, తిమ్మాపురంలో వున్న రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. హేచరీలలో వసతులు, రొయ్య పిల్లల ఉత్పత్తి ప్రక్రియలో వాడుతున్న ప్రోబయోటిక్స్, ట్రీట్మెంట్ ప్లాంట్స్, బ్రూడ్ స్టాక్‌లను పరిశీలించారు. అలాగే ఎంపెడా సిబ్బంది పరీక్షల నిమిత్తం పలు యాంటీ బయోటిక్స్ నమూనాలను సేకరించారు. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధిత యూనిట్లలో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. వాటిని ఆయా యూనిట్‌లలో వినియోగిస్తున్నారేమోనని కమిటీ పరిశీలించింది. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి. లక్ష్మణరావు, ఏడీ ప్రసాద్ నాయక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రియ, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, మండల మత్స్యశాఖాధికారి లావణ్య, హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాద్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

పాడి రైతులతో సహకార సంఘాలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులను పెంచే మహిళలతో డ్వాక్రా గ్రూపుల తరహాలో సహకార సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో దాకమర్రి, మజ్జిపేట, లక్ష్మీపురం గ్రామాల్లో పాడి పరిశ్రమ ఎక్కువగా ఉంది. ఈమేరకు ఆయా గ్రామాల్లో రైతులతో సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. బుధవారం ఆయా గ్రామాల్లో పర్యటించి, వివరాలు సేకరించారు. ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఈ గ్రూపులను ఏర్పాటు చేస్తుంది. పశుసంవర్ధక శాఖ లబ్ధిదారులను గుర్తిస్తే వారికి రుణ సదుపాయం, ఇతర వనరులను డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చేపడుతుంది. పశుపోషణ పట్ల అవగాహన కలిగిన 11 మంది మహిళలను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి, వారికి ఈ సదుపాయాలు కల్పిస్తారు. ఎక్కువ మంది ఉంటే రెండు గ్రూపులు కూడా ఏర్పాటు చేస్తారు. వారికి ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించడంతో పాటు రాయితీలు, పశుగ్రాసం వంటివి అందిస్తారు. అలాగే ఈ గ్రూపుల ద్వారా పాల సేకరణ కూడా చేపట్టనున్నారు. ముందుగా దాకమర్రి, మజ్జిపేటలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, తరువాత జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నట్టు ఫెడరేషన్‌కు చెందిన జిల్లా నోడల్ అధికారి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు రాజశేఖర్ తెలిపారు.

టైటిల్ డీడ్ తాకట్టు!

... 3వ పేజీ తరువాయి

బాగా దెబ్బతిన్నాయి. వ్యాపార విస్తరణ కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురై దివాలా తీశారు. కొన్ని వ్యాపారాలను రిలయన్స్ గ్రూపు సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ తీసుకున్న రుణాన్ని బ్యాంకు నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) జాబితాలో చేర్చింది. అయితే విశాఖలో వందల కోట్ల రూపాయల విలువైన భూమి హామీగా ఉండడంతో దానిని వేలం వేసి డబ్బులు రాబట్టుకోవడానికి డిమాండ్ నోటీసు జారీ చేసింది. కిశోర్ బియానీతో పాటు సూపర్ బజార్ యాజమాన్యానికీ అవి అందాయి. 'సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇన్వెస్టిమెంట్ (సరఫాసీ)' చట్టం-2002 కింద నోటీసులు ఇచ్చింది. తమకు తెలియకుండా ఆ షాపింగ్ మాల్‌ను వేరొకరికి లీజుకు ఇవ్వడం గానీ, భూమిని విక్రయించడం గానీ చేయకూడదని పేర్కొంది. ఇందులో నలుగురిని పార్టీలుగా చూపించింది. రుణ గ్రహీతగా ఫ్యూచర్ కార్పొరేట్ రీసోర్సెస్‌ను, గ్యారెంటీర్‌గా కిశోర్ బియానీని, తనఖాదారుగా సుహానీ మాల్ మేనేజ్‌మెంట్‌ను, లీజు ఇచ్చిన సంస్థగా విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్‌ను చూపించింది. భవిష్యత్తులో ఈ షాపింగ్‌మాల్, భూమితో జరిగే ఆర్థిక లావాదేవీలన్నింటిలోను ఈ సంస్థలకు చెందిన మేనేజింగ్ డైరెక్టర్లతో పాటు డైరెక్టర్లు అంతా బాధ్యులవుతారని స్పష్టం చేసింది. ఇదిలావుండగా ఈ నోటీసుల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో 51 విచారణకు ఆదేశించింది. సహకార శాఖలోనే ఒకరిని విచారణాధికారిగా నియమించింది. అయితే ఆరోపణలు ఉన్న అధికారికి ఈ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై సరైన విచారణ జరగాలని ప్రభుత్వం కోరుకోవడం లేదేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తి పత్రాలను ఓ లీజుదారునికి ఎలా ఇచ్చేశారు? అనేది జిల్లా అధికారులను సైతం విస్మయపరుస్తోంది.

ఏయూ వీసీ ఎంపిక ప్రక్రియ కొలిక్కి?

... 3వ పేజీ తరువాయి

సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా తమ స్థాయిలో ప్రయత్నాలు సాగిం చారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన మాత్రం మరోలా ఉన్నట్టు తాజాగా నెలకొన్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని భావిస్తున్న ప్రభుత్వం...అందుకు అనుగుణంగా జాతీయ స్థాయి వర్సిటీల్లో పనిచేసిన వారిని వీసీలుగా ఎంపిక చేయాలని నిర్ణయించు కున్నట్టు తెలుస్తోంది.

సీనియర్ ప్రొఫెసర్లలో చర్చ..

ప్రస్తుతం వర్సిటీలో ఏ ఇద్దరు ప్రొఫెసర్లు కలుసుకున్నా దీనిపైనే మాట్లాడుకుంటున్నారు. ఐఐటీ ప్రొఫెసర్లు పేర్లను సెర్చ్ కమిటీ పరిగణనలోకి తీసుకుందన్న విషయం బయటకు రావడంతో కొందరు సీనియర్ ప్రొఫెసర్లు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వందేళ్ల వేడుకలకు వర్సిటీ సిద్ధమవుతున్న తరుణంలో బయటనుంచి వచ్చిన వారిని వీసీగా నియమించడం వల్ల కొన్నిరకాల ఇబ్బందులు ఉంటాయని పేర్కొంటున్నారు. ఐఐటీలు, స్టేట్ వర్సిటీల్లో పాలన భిన్నంగా ఉంటుందని, ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు.

94.6% మందికి గ్యాస్ సబ్సిడీ

... 3వ పేజీ తరువాయి

జమ చేశారు. సిలిండర్లు డెలివరీ అయి...ఇంకా సొమ్ము అందని వారికి రెండు, మూడు రోజుల్లో బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కూటమి నేతలు...ఇచ్చిన హామీ మేరకు గత అక్టోబరు నుంచి పథకం అమలులోకి తీసుకువచ్చారు.

గొట్టిపల్లిలో పశు వైద్య శిబిరం

ఆనందపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ మోహినికుమారి మాట్లాడుతూ పశువుల సంరక్షణ కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి పశువుల్ని కాపాడుకోవచ్చని సూచించారు. అలాగే దూడలకు నట్టల నివారణ మందు క్రమం తప్పకుండా తాగించాలన్నారు. అనంతరం పశు యాజమాన్య విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే 46 పశువులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి పి. అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : గ్రామాల్లో జరుగుతున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశు వైద్యాధికారి కె. మహేశ్ కుమార్ కోరారు. బుధవారం పద్మనాభం పంచాయతీలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం 152 మేకలకు, 210 కోళ్లకు, 65 లేగ దూడలకు నట్టల నివారణ మందు వేశారు. అలాగే పాడి రైతులకు లవణ మిశ్రం అందజేశారు. 52 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పోలారావు, రెహమాన్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 5 వరకూ కుష్ఠు రోగులపై సర్వే

పద్మనాభం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 22 పంచాయతీల్లో ఈనెల 20 నుంచి వచ్చే నెల 5 వరకు కుష్ఠు రోగులను గుర్తించేందుకు 43 బృందాలతో సర్వే చేపట్టనున్నట్టు వైద్యులు కె. స్వప్న, మణికుమారి తెలిపారు. బుధవారం వారు రేవిడి, వెంకటాపురం, రౌతులపాలెం గ్రామాల్లో జరుతున్న సర్వేను పరిశీలించారు.

ఈ-శ్రమ కార్డులు అందజేత

ఆనందపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస పంచాయతీలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ బుధవారం ఈ శ్రమ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వెయ్యి మందికి కార్డులను అందజేశామని, తొలి విడతగా 500 మందికి, రెండవ విడతగా 300, మూడో విడతగా 200 మందికి అందజేసినట్టు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు చెక్

... 3వ పేజీ తరువాయి

రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో ప్రత్యేకంగా ట్రాక్‌ను తయారుచేశారు. ట్రాక్‌లో వాహనం నడిపే తీరును ఎక్కడికక్కడ గుర్తించేలా సెన్సార్లు ఏర్పాటుచేశారు. ఎవరైనా ట్రాక్‌లో వాహనం నడుపుతున్నప్పుడు సక్రమంగా డ్రైవింగ్ చేయలేకపోతే సెన్సార్లు గుర్తించి ఆన్‌లైన్‌లోనే ఆ విషయాన్ని నమోదు చేసేస్తాయి. అలాగే ట్రాక్ అంతా కవరయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతో రవాణా శాఖ అధికారులు తమ ఛాంబర్‌లో కూర్చునే డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి సమర్థతను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణాన్ని ఆరేళ్ల కిందటే ప్రారంభించినప్పటికీ నిధుల కొరత కారణంగా ఇంతవరకూ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించడంతో మిగిలిపోయిన పనులను పూర్తిచేశారు. ఈనెల 20న ట్రాక్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడంతో డ్రైవింగ్ పరీక్షలు ఆటోమేటిక్ ట్రాక్‌పైనే నిర్వహిస్తున్నారు. గతంలో డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యేవారిలో 50 శాతానికిపైగా ఉత్తీర్ణులైతే, ఇప్పుడు ఆటోమేటిక్‌ట్రాక్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కేవలం పది శాతం మంది మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత పొందడం విశేషం.

అక్రమాలకు అవకాశం లేదు

జి. ఆదినారాయణ, డీటీసీ

ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి రావడంతో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్టపడుతుంది. వాహనం నడపగలిగిన సామర్థ్యం కలిగిన వారికే లైసెన్స్‌జారీ అవుతుంది. దీనివల్ల ప్రమాదాలు తగ్గుతాయి. ట్రాక్‌కు సంబంధించిన టెక్నికల్ పనులుచూసే సిబ్బంది అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా డ్రైవింగ్ టెస్ట్ ప్రక్రియను పూర్తిగా టెక్నాలజీపైనే వదిలేయకుండా రవాణా శాఖ అధికారులు కూడా తమ ఛాంబర్ నుంచి ప్రత్యక్షంగా పరిశీలిస్తారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యంనాయుడు

విధిగా హెల్మెట్లు ధరించాలి

గాజువాక ఆర్టీవో సత్యంనాయుడు

కూర్మన్నపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే వారందరూ విధిగా హెల్మెట్లు ధరించాలని గాజువాక ఆర్టీవో సత్యంనాయుడు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీనగర్‌లోని టీఎస్ఆర్ టీటీకే కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లైసెన్స్ పొందిన విద్యార్థులు కూడా హెల్మెట్ ధారణపై అశ్రద్ధ చూపరాదన్నారు. అతి వేగం ప్రాణాంతకమని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ తలశిల బలరామకృష్ణ, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

అగనంపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూడలిలో గల శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ఉష, తదితరులు పాల్గొని రహదారి భద్రత గురించి వివించారు. వాహనాలను నడిపేవారంతా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపితే ప్రమాదాల బారినపడి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్ సుల్తాన్, ఐసీటీసీ కౌన్సిలర్ రవి, స్థానిక నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ. టి.శ్రీనివాసరావు, జగదీశ్, ఆటో యూనియన్ ప్రతినిధులు కె.సన్యాసిరావు, ఎన్.గోవింద్, దేముడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు పరిపాలన భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ ఉద్యోగుల మెడికల్ ప్రీమియం పెంపునకు నిరసనగా, ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ ప్లాంట్ నాయకులు తెలిపారు. ప్లాంట్ పరిపాలన భవనం వద్ద గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ధర్నా చేపడతామని, కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన వారితో పాటు ఉక్కు ఉద్యోగులు పాల్గొనవలసిందిగా కోరారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 15, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 18, క్యారెట్ 34 దొండకాయలు 36, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 42, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



65వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 65వ వార్డు పరిధిలో రూ.కోటిన్నరతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు అభివృద్ధి, మరోవైపు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. జెడ్పీ శేషాద్రి, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ మైదానం అభివృద్ధికి శంకుస్థాపన

పెదగంట్యాడలోని జీవీఎంసీ మైదానాన్ని రూ.50 లక్షలతో అభివృద్ధి చేసేందుకు పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ మైదానాన్ని ఆట స్థలంగా, వాకింగ్ ట్రాక్‌గా, పార్కుగానూ వినియోగించుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, కూటమి నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, కె.చినఅప్పారావు, కిలాని మునలయ్య, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే 75వ వార్డు సీతానగరంలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను పల్లా శ్రీనివాసరావు కార్పొరేటర్‌తో పాటు టీడీపీ నాయకుడు నమ్మి అప్పారావు, పి.శ్రీహరి, ఎన్.సింహాద్రి, సింహాచలం శ్రీమునిరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

71 వార్డులో ఓపెన్ జిమ్ నిర్మాణానికి..

శ్రీనగర్: గ్రేటర్ 71వ వార్డు పరిధి దిబ్బపాలెంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రూ.50 లక్షలతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పప్పు శంకరరావు, కరణం కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి: పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు పార్టీలకు అతీతంగా ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. అక్కిరెడ్డిపాలెంలో రూ.69 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించడంతో పాటు అక్కిరెడ్డిపాలెం, మిండి కాలనీల్లో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు కాలనీల్లో ప్రధాన రహదారుల విస్తరణలో ఎటువంటి ఆక్రమణలున్నా భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వాటిని తొలగించి పెట్టుకొని నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు గుడివాడ లతీశ్, రాజేష్, నూకరాజు, వి.రమణ, బొడ్డు రమణ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్ర కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అంకుపాలెంలో ఈ నెల 25 నుంచి జరగనున్న 71వ రాష్ట్ర స్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీల పోస్టర్లను తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పల్లా శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు బుధవారం గాజువాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గమాంబ అమ్మవారి జాతర సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, ఎం.ఉమాశంకర్, పి.అప్పారావు, దాస్, పీవీ రమణ, భగత్‌సింగ్, సత్యనారాయణ, శివ, పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

అగనంపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి ప్రశాంతినగర్, అన్నపూర్ణా నగర్, పరిసర ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుందని పలువురు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేఎస్ఎన్ రెడ్డి నగర్‌లో రింగ్ లైటు ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, టీడీపీ నాయకులు ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గుర్తు తెలియని యువకుడి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గవర జగ్గయ్యపాలెం సమీపంలో బుధవారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గవర జగ్గయ్యపాలెం సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన బుధవారం గుర్తు తెలియని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఉన్నట్టు స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందచేశారు. దువ్వాడ రైల్వే ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకునికి అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సుమారు 30 ఏళ్ల గల ఈ యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడు బ్లాక్ టీషర్టుపై బ్రౌన్ కలర్ స్వెట్టర్, బ్లూ జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 7382058996 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ లక్ష్మి తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'బీఎస్పీ పటిష్ఠానికి కృషి'

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఒక్క పరంజ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం 15వ వార్డులోని కొండవాలు ప్రాంతం అంబేడ్కర్‌నగర్‌లో పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ తూర్పు నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎన్నిక చేపట్టారు. తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జిగా పెదపెంకి శివప్రసాదరావు, అధ్యక్షుడుగా ఎస్ఏ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షులుగా ధర్మానవాసు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కొండలరావు, కన్వీనర్‌గా .రత్నం ఎన్నికయ్యారు.



జీఎంపీ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

మెడ్‌టెక్ జోన్‌లో ఔషధ నాణ్యతపై సదస్సు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంచి ఉత్పాదక పద్ధతుల (జీఎంపీ) ద్వారా ఔషధ నాణ్యత హామీని పెంచడంపై దృష్టిసారించే జాతీయ సదస్సును బుధవారం మెడ్‌టెక్ జోన్‌లో బుధవారం నిర్వహించారు. పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సురక్షితమైన, సమర్థవంతమైన, అధిక నాణ్యత గల ఔషధ ఉత్పత్తులను తయారు చేయడం వంటి అంశాలపై సదస్సుకు హాజరైన ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా ఉత్పత్తి నాణ్యతతో పాటు భద్రతా సామర్థ్యాన్ని పెంచడం, లోపాలు, నష్టాలను ఎలా తగ్గించాలన్న విషయాలపై పలువురు ప్రసంగించారు.

ఈ సందర్భంగా మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ వ్యాపారంలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి, ఉత్పత్తులను మెరుగుపరచడానికి, మార్కెట్ వాటాలను పెంచాలని చూస్తున్న సంస్థలకు పెట్టుబడులను ఆకర్షించడం చాలా ముఖ్యమని, తయారీ పద్ధతులు నాణ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పీహెచ్‌డీసీసీఐ డైరెక్టర్ నాసిర్ జమాల్ మాట్లాడుతూ మంచి తయారీ పద్ధతులు, అధిక నాణ్యత, ఉత్పత్తిని నిర్ధారించడానికి ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీబీఎల్ ట్రాన్స్‌పోర్టు ఎండీ రాజేశ్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఈశ్వర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు క్షమాపణలు చెప్పాలి

విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ



ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు కార్మికులు, ఉద్యోగులను ఉద్దేశించి అభ్యం తరకర వ్యాఖ్యలు చేసిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వెంటనే క్షమాపణలు చెప్పాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మథరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు కార్మికులు ఇష్టం లేకపోతే ఉద్యోగాలకు రాజీనామా చేసి వీఆర్ఎస్ తీసుకొని బయటకు పోవాలంటూ విష్ణుకుమార్‌రాజు మాట్లాడడం ఎంతమాత్రం తగదన్నారు. ఎమ్మెల్యే కార్పొరేట్ సంస్థల ప్రతినిధిగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలను జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వెంటనే ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు, కార్మికులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్‌జే అచ్యుతరావు, కె.సత్యనారాయణ, వి.కృష్ణారావు, అప్పారావు, పైడిరాజు, రామారావు, లక్ష్మి, శంకరరావు, పద్మ, సంతోష్, గణేష్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలి'

మల్కాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కార్మికుల చట్టాలను సక్రమంగా అమలు చేసినప్పుడే స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్టు వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు అన్నారు. హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద బుధవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్కాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్, గుల్లలపాలెంలో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ గులిగిందల లావణ్య బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు గులిగిందల కృష్ణ, మమత, గొందేశి సత్యనారాయణరెడ్డి,సాల్మన్‌రాజు, పిలక రమణ, కృష్ణమూర్తి, శ్రీరామరెడ్డి,రామారావు, శివ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గవర కంచరపాలెంలో...

ఆర్పీపేట (కంచరపాలెం) : జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెంలో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు మళ్ల రాంప్రసాద్, మళ్ల శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం బోల్తా

నలుగురికి గాయాలు



పెందుర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సరిపల్లి జాతీయ రహదారి పరిధిలోని వంతెన వద్ద బుధవారం రాత్రి 108 వాహనం బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... నర్సీపట్నంకు చెందిన చంద్రమ్మ (70) కి శ్వాసకోశ సమస్య తలెత్తడంతో ఆమె ఇద్దరు కుమారులు పెద్దిరాజు, సూరిబాబు, కోడలు లక్ష్మి 108 వాహనంలో ఆరిలోవలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువస్తుండగా సరిపల్లి వంతెన వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చంద్రమ్మకు తీవ్ర గాయాలు కాగా ఇద్దరు కుమారులు, కోడలికి స్వల్ప గాయాలయ్యాయి. పెందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను మరో వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

శరవేగంగా వంతెన నిర్మాణం

రెండు నెలల్లో పూర్తి కానున్న సర్దార్ వల్లాభ్ భాయ్ పటేల్ వంతెన పనులు

మల్కాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : డాక్‌యార్డు సమీపంలో చేపట్టిన సర్దార్ వల్లాభ్‌భాయ్ పటేల్ వంతెన నిర్మాణం మరో రెండు నెలల్లో పూర్తి కానుంది. ఇప్పటికే పనులు చివరి దశకు చేరుకోవాల్సి ఉండగా కాంట్రాక్టర్ అలసత్వం వల్ల ఆలస్యమయ్యాయి. నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని లక్షలాది మంది ప్రజలు ఎదురుచూస్తున్నారు. గుజరాత్‌కు చెందిన ప్రముఖ కంపెనీ ఈ వంతెనను నిర్మిస్తుంది. నిర్మాణానికి తొలుత 23 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారు. కానీ నిర్మాణ సమయంలో పాత శిథిలాలను తొలగించేటప్పుడు అంచనాలకు మించి కష్టంగా ఉండడంతో సదరు కాంట్రాక్టర్ పనిని కొంతకాలం నిలుపుదల చేశారు. ఈనేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందారు. వంతెన నిర్మాణం ఇక జరగదని, నిర్మాణం పేరుతో అపుచేశారని పుకార్లు మొదలు కావడంతో అందరిలోనూ ఆందోళన వ్యక్తమైంది. ఈ విషయం వంతెన నిర్మిస్తున్న పోర్టు అధికారుల చెవిన పడడంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి, సమస్యను పరిష్కరించారు.



ఒకవైపు పూర్తయిన వంతెన నిర్మాణం

నాటి నుంచి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే వంతెన నిర్మాణం ఒకవైపు పూర్తిచేశారు. మరోవైపు యుద్ధప్రాతిపదికన పనులు జరు గుతున్నాయి. రెండు నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని పోర్టు అధికారులు భావిస్తున్నారు. ఏదిఏమైనా వంతెన నిర్మాణం పూర్తయితే గానీ పారిశ్రామిక ప్రాంతవాసులకు ప్రయాణ కష్టాలు తీరవు. కాగా నిర్మాణం పూర్తయితే వంతెనను నేవీ స్వాధీనం చేసుకుంటుందన్న ప్రచారం కూడా ఉంది. ఈ ప్రచారాన్ని పోర్టు అధికారులు ఖండిస్తు న్నారు. వంతెన ప్రజల కోసం నిర్మిస్తున్నామని, వారికే అంకితం చేస్తామని చెబుతున్నారు.

విద్యార్థుల ఉరుకులు, పరుగులు

పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా ఐదుగురు చేరిక

అనుమతివ్వని కేంద్ర నిర్వాహకులు

పెందుర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. చినముషిడివాడలో రెండు పూటలా జరిగిన పరీక్షకు సుమారు 225 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఐదుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. అనకాపల్లి, తగరపువలస, భీమవరం, గాజువాక నుంచి వచ్చిన విద్యార్థులు నిర్వాహకులను వేడుకున్నా ఫలితం లేక వెనుదిరిగారు. పరీక్షాకేంద్రానికి పార్కింగ్ లేక బీఆర్టీఎస్ రహదారి పక్కగా వాహనాలు నిలిపివేశారు.

అక్కిరెడ్డిపాలెం : షీలానగర్ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వాహకులు ఉదయం 8.30 గంటలకే గేటు మూసివేయగా.. 8.45కు శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన ఎ.దిలీప్ వచ్చినప్పటికీ ఆధార్ కార్డు తేకపోవడంతో అనుమతించలేదు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు వాట్సాప్ ద్వారా ఆధార్ కార్డు పంపినప్పటికీ నిర్వాహకులు అందుబాటులో లేక ఆవేదనకు గురయ్యాడు. 8.53 గంటలకు అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన దుర్గాప్రసాద్ చేరుకున్నాడు. పరీక్షకు అనుమతించాలని పెద్దగా కేకలు వేసినప్పటికీ నిర్వాహకులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 గంటల తర్వాత సెక్యూరిటీ వచ్చి ఎవరినీ అనుమతించమని హిందీలో చెప్పి వెళ్లిపోవడంతో ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులతో పాటు ఇతర అభ్యర్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు.



చినముషిడివాడ కేంద్రం వద్ద విద్యార్థులు

బోధనలో మార్పు అవసరం : ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాలానుగుణంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో విద్యా బోధనలో కూడా మార్పులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. బుధవారం ఆయన 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ లక్ష్మీనగర్‌లో కేంద్రం, జీవీఎంసీ నిధులతో నిర్మించిన జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అదనపు భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బోధనలో మార్పులు తీసుకొస్తుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసిందని, తమ వాటిని సరిచేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు మంచి మార్గాన్ని అన్వేషిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మితిరెడ్డి శంకర్, జనసేన నాయకుడు పుర్రె సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు



కమిషనర్ సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న మేయర్, ఫ్లోర్ లీడర్లు, అధికారులు


జీవీఎంసీ కమిషనర్ సేవలు ప్రశంసనీయం

» బదిలీపై వెళ్తున్న సంపత్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పాలనలో కొద్ది కాలంలో ప్రజల మన్ననలు అందుకున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను విశాఖ ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి సీడీఎంఏగా బదిలీపై వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అన్ని విభాగాలను సమన్వయపరుస్తూ నగరాభివృద్ధికి సంపత్‌కుమార్ కృషి చేశారన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ సంపత్‌కుమార్ సేవలను కొనియాడారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో కమిషనర్‌గా పనిచేసిన ఆరు నెలల కాలం ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ పరస



పరస జరుగుతున్న దృశ్యం

మల్కాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం (కాకి అప్పన్న పరస) బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జెర్రిపోతుల నూకరాజు తీర్థం రేపు

సింధియా, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 63వ వార్డు చింతలలోవ గ్రామంలో శుక్రవారం మరిడిమాంబ (జెర్రిపోతుల నూకరాజు) తీర్థం జరగనుంది. ఈమేరకు ఆలయ ధర్మకర్త, టీడీపీ సీనియర్ నాయకుడు జెర్రిపోతుల నరసింగరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా నిర్వహిస్తునట్టే ఈసారి కూడా అమ్మవారి ఆలయం ఆవరణలో తీర్థం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

గోపాలపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పద్మనాభనగర్ ప్రాథమిక పాఠశాలకు 92వ వార్డు జనతా కాలనీ మహిళా సేవా సంఘం సభ్యు లు రూ.10 వేలు విలువ చేసే సీలింగ్ ఫ్యాన్‌లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు మొజ్జాడ విమల మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా తమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడు తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమారాణి, సంఘ ప్రతినిధులు రమాకుమారి, శివలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆలయంలో మహా అన్న సమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జగదాంబ కూడలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుమ్మరవీధి పోలమాంబ పరస మహోత్సవంలో మొక్కులు చెల్లించుకోలేని భక్తుల కోసం మరో నెల రోజులు అవకాశం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. నిత్యం అమ్మవారికి పాలు, జలాభిషేకం, పసుపు, కుంకుమ పూజలకు ఏర్పాట్లు చేశారు. 28న మారు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పరస ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేశారు. తాడివీధి, సాలిపేట జెండాచెట్టు, స్థానికులు, జగదాంబ వ్యాపార కూడలిలోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది అన్న ప్రసాదం స్వీకరించారు. రెండు వేల మందికి ప్రసాద వితరణ చేసినట్లు కమిటీ తెలిపింది.

ఘనంగా అమ్మవార్ల పరస

అక్కయ్యపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు జగన్నాథపురంలో వేంచేసిన భూలోకమాత, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వర స్వామి, సీతారాముల వారి పరస మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు ఆలయాలకు విచ్చేసి అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం తప్పెట గుళ్లు, సేవా గరిడీలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్, టీడీపీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి శ్రీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు.

కేవీలో పరీక్షా పే చర్చ నేడు

అక్కయ్యపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కమల్‌జిత్ తెలిపారు. ఇందులో నగరానికి చెందిన పది పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడిని తగ్గించడమే కాకుండా గుణాత్మక విద్యను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ క్విజ్ పోటీ ద్వారా విద్యార్థులు జ్ఞానాన్ని, పోటీ తత్వాన్ని పెంపొదించుకుంటారు. ఈ పోటీల్లో టింపనీ, శ్రీప్రకాష్, శ్రీ కృష్ణ విద్యామందిర్, సత్యసాయి, విశాఖ వ్యాలీ, నవోదయ విద్యాలయ, కేవీ ఎన్ఏడీ, కేవీ ఎస్వీఎన్-1, కేవీ మల్కాపురం, కేవీ వాల్తేరు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు

అక్కయ్యపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు సూరిబాబునగర్‌లో రూ.26.8 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ, సామాజిక భవనాన్ని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషిచేస్తానని చెప్పారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, టీడీపీ, బీజేపీ నాయకులు పుక్కళ్ళ పైడికొండ, గార ఈశ్వరరావు, ఆవాల నారాయణస్వామి, గొలగాని సౌజన్య, ఏఈ ఎ.ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

అధికారికి సన్మానం




కింజరాపు ప్రభాకర్‌ను సత్కరిస్తున్న కిక్ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కింజరాపు ప్రభాకర్‌ను విశాఖ కిక్ బాక్సింగ్ సంఘం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాస్టర్లు సభ్యులు బుధవారం ప్రభాకర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. కిక్ బాక్సింగ్ సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కిక్ బాక్సింగ్ మాస్టర్స్ సుధాకర్, కార్యదర్శి ఎర్రయ్య, రాందేవ్, ధన, సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో నీరు లేక అగచాట్లు!

» మార్గశిర మాసోత్సవాల్లో కొళాయి తొలగింపు » పాలతోనే అభిషేకం » జలాభిషేకానికి దూరం » పట్టించుకోని అధికారులు

జగదాంబ కూడలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆలయ అధికారుల అనాలోచిత చర్య కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఆలయ సిబ్బంది జోక్యంతో అమ్మవారిని నేరుగా పూజించుకునే సంప్రదాయానికి దూరమైన భక్తులకు ఇప్పుడు అదనంగా నీటి అగచాట్లు తోడయ్యాయి. సాధారణంగా ఏ ఆలయంలోకి అయినా భక్తులు తొలుత పాదాలు శుభ్రపరుచుకుని ప్రవేశించడం నియమం. అమ్మవారి ఆలయాల్లో మరింత భక్తిప్రపత్తులతో ఈ పని చేస్తారు. సుదూర ప్రాంతాల నుంచి కనకమహాలక్ష్మి దర్శనానికి వచ్చే భక్తులు ఇటీవల ఆ వసతి కోల్పోయారు. ప్రధాన ప్రవేశమార్గం వద్ద భక్తులు కాళ్లు కడుక్కునేందుకు ఆరుబయట కుళాయి ఉండేది. మార్గశిర మాసోత్సవాల్లో ఈవో ఈ కుళాయిని మూయించేశారని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. ఉత్సవాలు ముగిసినా



ప్రవేశ మార్గం వద్ద మూతపడిన కుళాయి

ఇదే పరిస్థితి కొనసాగడం భక్తులను ఇక్కట్లపాలు చేస్తోంది. నిత్యం వందల సంఖ్యలో వచ్చే భక్తులు చెప్పులను భద్రపరుచుకొని, పక్కనే ఉండే కుళాయి వద్ద పాదాలు శుభ్రపరచుకుని క్యూలైన్లలో ప్రవేశించి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. కొందరు అమ్మవారికి జలాభిషేకం కూడా చేస్తుంటారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీటి పంపులు లేకపోవడం, ఆలయ ఆవరణలో ఆ సౌకర్యం దూరం చేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అపరిశుభ్రతతో ఆలయ ప్రవేశం చేయాల్సి వస్తోందని మదనపడుతున్నారు. అమ్మవారికి బిందెలతో జలాభిషేకం చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ప్రస్తుతం దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు బిందెడు నీటి కోసం అధికారులు, సిబ్బందిని ప్రాధేయపడినా పట్టించుకోవడం లేదని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పాలతో అమ్మవారికి అభిషేకం చేసి సంతృప్తి పడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కుళాయిని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలో సౌరశక్తి ఫలకాల ఏర్పాటు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, వేదాంత కంపెనీ ప్రతినిధులు తదితరులు

జగదాంబ కూడలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ లక్ష్మీటాకీస్ వద్ద ఎంవీడీఎం పాఠశాలలో రూ.4 లక్షల వ్యయంతో వేదాంత కంపెనీ ఏర్పాటు చేసిన సౌరశక్తి ఫలకాలను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేదాంత యాజమాన్యం పాఠశాలలో సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు పాత నగరంలో భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. వేదాంత కంపెనీ సీఈవో సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిలో తమవంతు భాగస్వామ్యం అందిస్తామన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యకర పరిస్థితులు కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్పొరేటర్ సాధిక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశాలలో విద్యార్థులకు ప్రత్యేక ఓపీ కేంద్రం ప్రారంభం



విద్యార్థిని కంటిని పరీక్షిస్తున్న దృశ్యం

సీతమ్మధార, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో విద్యార్థులకు ప్రత్యేక వార్డును, ఓపీ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి, వైద్యురాలు జ్యోతిర్మయి, ఆర్ఎంఓ నవీన్‌కుమార్ ప్రత్యేక ఓపీ విభాగాన్ని, వార్డును ప్రారంభించారు. విద్యార్థులకు ఆలస్యం లేకుండా వైద్యం అందిస్తామన్నారు.

కాపు రైతు విభాగంలో నాగేశ్వరరావుకు పదవి

డాబాగార్డెన్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కాపు సంఘం జాతీయ రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా మీసాల నాగేశ్వరరావును నియమిస్తున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని బాధ్యతతో నిర్వహిస్తానని నాగేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

జ్ఞానాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, రోడ్డు భద్రతపై స్థానిక సెయింట్‌జోసెఫ్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం నెహ్రూ యువ కేంద్రం, ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో కాన్వెంటు కూడలిలో ప్లకార్డులు పట్టుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సుకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు హాజరయ్యారు. విశాఖపట్నంలో రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను వీడియో ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ప్రమాదాల్లో ఎక్కువగా యువత ఉంటున్నారని అన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు సూచించారు.



విద్యార్థులు, అధికారులు, అధ్యాపకుల ర్యాలీ

ఈ కార్యక్రమంలో కూచిపూడి శ్రావ్య, జర్నలిజం స్కూల్ వైస్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు, నెహ్రూ యువకేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి, పోలీసు అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారానికి గనులు కేటాయించరేం?

సీతంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారానికి ఇనుప ఖనిజ గనులు కూడా కేటాయించి, భవిష్యత్తులో ప్రైవేటీకరించబోమనే సంకేతాలు ఆంధ్ర ప్రజలకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని విశాఖ స్టీల్‌ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ జేఏసీ, బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి మాట్లాడుతూ నక్కపల్లి సహా అనేక ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకు ఇనుప ఖనిజ గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, విశాఖ ఉక్కు కర్మాగారానికి ఎందుకు ఇవ్వడం లేదో, సమాధానం చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రజా ఉద్యమం ద్వారానే ఉక్కు కర్మాగారాన్ని ని



సమావేశంలో పాల్గొన్న జేఏసీ, బీఎస్పీ నాయకులు

లబెట్టుకోవాలని బీఎస్పీ మహా ధర్నా చేసిందని, వీఎస్పీ జేఏసీ ప్రజా మద్దతు కూడగట్టి విశాఖ ఉక్కు పరిరక్షణకు నిలబడుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగాలంటే టీడీపీ మద్దతు కావాలని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోకుండా ఉండాలంటే ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపక తప్పదన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మూసేసినా, ప్రైవేటీకరణ చేసినా రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ కో-కన్వీనర్, బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాదరావులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పూర్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని పనిచేయించాలని యాజమాన్యం భావించినపుడు ఇప్పుడున్న కార్మికులతో పాటు కొత్త కార్మికులను నియమించుకోవలసిన అవసరముందన్నారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న నిర్వాసితులను వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతి రైతులకు ఇచ్చినట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్పీ జేఏసీ కన్వీనర్ లకే రాజారావు, పీకేఎం, కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కిరండూల్ రైలు కోరాపుట్ వరకే

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ సెక్షన్ మధ్య నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్ రైళ్ల (58501/58502) గమ్యాలను కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) రైలు ఈ నెల 30న విశాఖ నుంచి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) ఈ నెల 30న కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. రౌర్కెలా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18107) ఈ నెల 29న కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-రౌర్కెలా ఎక్స్‌ప్రెస్ (18108) ఈ నెల 30న కోరాపుట్‌లో బయలుదేరి రౌర్కెలా చేరుతుంది.

సమతా ఎక్స్‌ప్రెస్‌కు బిలోచ్‌పురా స్టేషన్‌లో హాల్ట్

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ, హజ్రత్ నిజాముద్దీన్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులకు రాజ్ కి మండీ స్టేషన్ వద్ద గల హాల్ట్‌ను తొలగించి ఆ స్థానంలో ఆగ్రా డివిజన్‌లోని బిలోచ్‌పురా స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే 12807 నంబరు గల రైలు మార్చి 16 నుంచి మధ్యాహ్నం 3.14 గంటలకు, తిరుగు ప్రయాణంలోని హజ్రత్ నిజాముద్దీన్ నుంచి విశాఖ వచ్చే 12808 నంబరు గల రైలు మార్చి 15 నుంచి ఉదయం 8.55 గంటలకు బిలోచ్‌పురా స్టేషన్‌కు చేరుతాయని పేర్కొన్నారు.

కిరణ కిమ్మీరం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ రచించిన కిరణ కిమ్మీరం పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ జి.రఘురామారావు, ఆచార్య బాల మోహన్ దాస్ విచ్చేశారు. ఆచార్య ఆతుకూరి వెంకటేశ్వరరావు పుస్తకాన్ని సమీక్షించారు. రచయిత శేఖరమంత్రి ప్రభాకరరావు తన అనుభూతిని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణమూర్తి, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

రహదారులపై బస్సులు ఎక్కువసేపు ఆపొద్దు: సీఐ

సీతమ్మధార, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బస్సులను రోడ్డుకు అడ్డంగా ఎక్కువ సేపు నిలపకుండా ప్రయాణికులు ఎక్కిన వెంటనే ముందుకు సాగాలని, తోటి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ట్రాఫిక్ సీఐ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. రామాటాకీస్ సమీపంలో అంబేడ్కర్ భవన్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద రహదారి పక్కనే ప్రైవేట్ బస్సులు నిలిపి బాటసారులకు ఆటంకం కలిగిస్తున్న బస్సు యజమానులతో ద్వారకా సబ్‌డివిజన్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ బుధవారం సమావేశం నిర్వహించారు. సత్యం కూడలి నుంచి రామాటాకీస్ వెళ్లే మార్గంలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారం నిలిపివేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలని



ప్రైవేటు బస్సుల యాజమాన్య ప్రతినిధులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ దుర్గాప్రసాద్

సూచించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించిన వార్తకు స్పందించిన ట్రాఫిక్ పోలీసులు ప్రైవేట్ బస్సుల నిలుపుదలపై యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సమావేశం నిర్వహించి సూచనలు చేసినా, సాయంత్రం యథావిధిగా ప్రైవేట్ బస్సులు గంటల తరబడి నిలిపి ఉంచారు. పోలీసుల మాటలు పెడచెవిన పెట్టి తమకు పట్టదన్నట్లు బస్సులను అక్కడే పార్కింగ్ చేయడం గమనార్హం.

ఎన్‌సీసీ డ్రెసింగ్ క్యాంపులో విద్యార్థినులు



క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లతో ప్రిన్సిపాల్ మంజుల, క్యాంపు అధికారిణి

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్), ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ విజయనగరం సంయుక్తంగా నిర్వహించిన డ్రెసింగ్ క్యాంపు-8లో ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన 27 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. రఘు ఇంజనీరింగ్ కళాశాలలో పది రోజులు జరిగిన క్యాంపులో డ్రిల్, ఫైరింగ్ వంటి వివిధ అంశాలలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని క్యాంపు సర్టిఫికెట్లు పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాలు విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సామాజిక సేవా, స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.

ట్రయిథ్లాన్ పోటీలకు వంశీకిరణ్, శేఖర్



వంశీకిరణ్



శేఖర్

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడల ట్రయిథ్లాన్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు విశాఖకు చెందిన కె.వంశీకిరణ్, సీహెచ్.శేఖర్ ప్రాతినిధ్యం వహిస్తారు. డెహ్రాడూన్‌లో ఈ నెల 28 నుంచి జరిగే ఈ టోర్నీలో రాష్ట్ర జట్టుకు కోచ్‌గా విశాఖకు చెందిన సీహెచ్.నాగేశ్వరరావు, టెక్నికల్ అఫీషియల్‌గా సీహెచ్ అప్పలరాజు వ్యవహరిస్తారు. ప్రతిష్ఠాత్మక జాతీయ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు వంశీకిరణ్, శేఖర్‌లతోపాటు కోచ్‌గా వ్యవహరిస్తున్న నాగేశ్వరరావును రాష్ట్ర ట్రయిథ్లాన్ సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్, దానయ్య, ద ఒలింపిక్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం'

మద్దిలపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తర నియోజకవర్గ బీజేపీ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్ రాజు క్షమాపణలు చెప్పాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలతో ప్యాకేజీ రాలేదని మా వల్లే వచ్చిందని, కార్మికుల ఆశకు అంతు ఉండాలని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించడందురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం, ప్రైవేటీకరణ చేయమని మోదీతో ప్రకటన చేయించాలని ఉత్తరాంధ్ర ప్రజలు, స్టీల్‌ప్లాంటు కార్మికులు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీపై కూటమి ప్రభుత్వంపై సానుకూలత రాకపోవడంతో ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

టైటిల్ డీడ్ తాకట్టు!

... 3వ పేజీ తరువాయి

బాగా దెబ్బతిన్నాయి. వ్యాపార విస్తరణ కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురై దివాలా తీశారు. కొన్ని వ్యాపారాలను రిలయన్స్ గ్రూపు సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ తీసుకున్న రుణాన్ని బ్యాంకు నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) జాబితాలో చేర్చింది. అయితే విశాఖలో వందల కోట్ల రూపాయల విలువైన భూమి హామీగా ఉండడంతో దానిని వేలం వేసి డబ్బులు రాబట్టుకోవడానికి డిమాండ్ నోటీసు జారీ చేసింది. కిశోర్ బియానీతో పాటు సూపర్ బజార్ యాజమాన్యానికీ అవి అందాయి. 'సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇన్వెస్టిమెంట్ (సరఫాసీ)' చట్టం-2002 కింద నోటీసులు ఇచ్చింది. తమకు తెలియకుండా ఆ షాపింగ్ మాల్‌ను వేరొకరికి లీజుకు ఇవ్వడం గానీ, భూమిని విక్రయించడం గానీ చేయకూడదని పేర్కొంది. ఇందులో నలుగురిని పార్టీలుగా చూపించింది. రుణ గ్రహీతగా ఫ్యూచర్ కార్పొరేట్ రీసోర్సెస్‌ను, గ్యారెంటీర్‌గా కిశోర్ బియానీని, తనఖాదారుగా సుహానీ మాల్ మేనేజ్‌మెంట్‌ను, లీజు ఇచ్చిన సంస్థగా విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్‌ను చూపించింది. భవిష్యత్తులో ఈ షాపింగ్‌మాల్, భూమితో జరిగే ఆర్థిక లావాదేవీలన్నింటిలోను ఈ సంస్థలకు చెందిన మేనేజింగ్ డైరెక్టర్లతో పాటు డైరెక్టర్లు అంతా బాధ్యులవుతారని స్పష్టం చేసింది.

ఈ నోటీసుల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో 51 విచారణకు ఆదేశించింది. సహకార శాఖలోనే ఒకరిని విచారణాధికారిగా నియమించింది. అయితే ఆరోపణలు ఉన్న అధికారికి ఈ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై సరైన విచారణ జరగాలని ప్రభుత్వం కోరుకోవడం లేదేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తి పత్రాలను ఓ లీజుదారునికి ఎలా ఇచ్చేశారు? అనేది జిల్లా అధికారులను సైతం విస్మయపరుస్తోంది.

ఏయూ వీసీ ఎంపిక ప్రక్రియ కొలిక్కి?

... 3వ పేజీ తరువాయి

సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా తమ స్థాయిలో ప్రయత్నాలు సాగించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన మాత్రం మరోలా ఉన్నట్టు తాజాగా నెలకొన్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. ఉన్నత విద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని భావిస్తున్న ప్రభుత్వం...అందుకు అనుగుణంగా జాతీయ స్థాయి వర్సిటీల్లో పనిచేసిన వారిని వీసీలుగా ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

సీనియర్ ప్రొఫెసర్లలో చర్చ: ప్రస్తుతం వర్సిటీలో ఏ ఇద్దరు ప్రొఫెసర్లు కలుసుకున్నా దీనిపైనే మాట్లాడుకుంటున్నారు. ఐఐటీ ప్రొఫెసర్ల పేర్లను సెర్చ్ కమిటీ పరిగణనలోకి తీసుకుందన్న విషయం బయటకు రావడంతో కొందరు సీనియర్ ప్రొఫెసర్లు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వందేళ్ల వేడుకలకు వర్సిటీ సిద్ధమవుతున్న తరుణంలో బయట నుంచి వచ్చిన వారిని వీసీగా నియమించడం వల్ల కొన్ని ఇబ్బందులు ఉంటాయంటున్నారు. ఐఐటీలు, స్టేట్ వర్సిటీల్లో పాలన భిన్నంగా ఉంటుందని, ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు చెక్

.. 3వ పేజీ తరువాయి

రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో ప్రత్యేకంగా ట్రాక్‌ను తయారుచేశారు. ట్రాక్‌లో వాహనం నడిపే తీరును ఎక్కడికక్కడ గుర్తించేలా సెన్సార్లు ఏర్పాటుచేశారు. ఎవరైనా ట్రాక్‌లో వాహనం నడుపుతున్నప్పుడు సక్రమంగా డ్రైవింగ్ చేయలేకపోతే సెన్సార్లు గుర్తించి ఆన్‌లైన్‌లోనే ఆ విషయాన్ని నమోదు చేసేస్తాయి. అలాగే ట్రాక్ అంతా కవరయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతో రవాణా శాఖ అధికారులు తమ ఛాంబర్‌లో కూర్చునే డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి సమర్థతను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అవకాశం ఉంటుంది. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నిర్మాణాన్ని ఆరేళ్ల కిందటే ప్రారంభించినప్పటికీ నిధుల కొరత కారణంగా ఇంతవరకూ పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించడంతో మిగిలిపోయిన పనులను పూర్తిచేశారు. ఈనెల 20న ట్రాక్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడంతో డ్రైవింగ్ పరీక్షలు ఆటోమెటిక్ ట్రాక్‌పైనే నిర్వహిస్తున్నారు. గతంలో డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యేవారిలో 50 శాతానికిపైగా ఉత్తీర్ణులైతే, ఇప్పుడు ఆటోమేటిక్‌ట్రాక్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కేవలం పది శాతం మంది మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత పొందడం విశేషం.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు అవకాశంలేదు

ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అందుబాటులోకి రావడంతో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్టపడుతుంది. వాహనం నడపగలిగిన సామర్థ్యం కలిగిన వారికే లైసెన్స్‌జారీ అవుతుంది. దీనివల్ల ప్రమాదాలు తగ్గుతాయి. ట్రాక్‌కు సంబంధించిన టెక్నికల్ పనులుచూసే సిబ్బంది అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా డ్రైవింగ్ టెస్ట్ ప్రక్రియను పూర్తిగా టెక్నాలజీపైనే వదిలేయకుండా రవాణా శాఖ అధికారులు కూడా తమ ఛాంబర్ నుంచి ప్రత్యక్షంగా పరిశీలిస్తారు.

జి.ఆదినారాయణ, డీటీసీ

94.6% మందికి గ్యాస్ సబ్సిడీ

... 3వ పేజీ తరువాయి

జమ చేశారు. సిలిండర్లు డెలివరీ అయి...ఇంకా సొమ్ము అందని వారికి రెండు, మూడు రోజుల్లో బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కూటమి నేతలు...ఇచ్చిన హామీ మేరకు గత అక్టోబరు నుంచి పథకం అమలులోకి తీసుకువచ్చారు.

అప్పన్న సన్నిధిలో జబర్దస్త్ నటుడు రాజు



కప్పస్తంభం వద్ద రాజు దంపతులు

సింహాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని జబర్దస్త్ ఫేమ్ రైజింగ్ రాజు సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

గీతంలో పుస్తక ప్రదర్శన

సాగర్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఎనలేనిదని గీతం వర్సిటీ రిజిస్ట్రార్ డి. గుణశేఖరన్ అన్నారు. గీతం నాలెడ్జి రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి పుస్తక ప్రదర్శన ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం గ్రంథాలయ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌పీఏ బాల సుబ్రహ్మణ్యన్, గ్రంథాలయ అధికారి డాక్టర్ శివప్రసాద్ పండా, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధంపై విస్తృత తనిఖీలు



తోపుడుబండ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది బుధవారం మద్దిలపాలెంలో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వార్డు కార్యదర్శి లక్ష్మీదేవి 23వ వార్డులోని పలు ప్రాంతాల్లో చిరు వర్తకుల దుకాణాల వద్దకు వెళ్లి పరిశీలించారు. కొన్ని టిఫిన్, కూరగాయలు దుకాణాల వద్ద పాలిథిన్ కవర్లు గురించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, అయినప్పటికీ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది పునరావృతమైతే కేసులు తప్పదని హెచ్చరించారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీ నరసింహ-1 (104ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్ మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 15, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 18, క్యారెట్ 34 దొండకాయలు 36, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 42, పొటల్స్ 80, కీర దోస 34, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

పోలీస్‌స్టేషన్ రహదారికి శంకుస్థాపన

ఆరిలోవ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పోలీస్‌స్టేషన్ రహదారిలో రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి పీఎస్ సర్వీసు రోడ్డులో బుధవారం ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సీపీ శంఖబ్రత బాగ్చి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ జీవీఎంసీ నిధులు రూ.70 లక్షలతో 20 అడుగుల వెడల్పు, 40 అడుగుల రోడ్డును నిర్మించనున్నట్టు తెలిపారు. దీనివల్ల బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డు నుంచి పోలీస్‌స్టేషన్‌కు నేరుగా రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం విమ్స్ రహదారి నుంచి వాహనాలు వస్తున్నాయన్నారు. ఈ రహదారి, కల్వర్టు పనులను త్వరతగతిన పూర్తి చేసిన అందబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజిత జువేరి, ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, జోనల్ కమిషనర్ ఫణిరామ్, ఏఈ వెంకటరావు, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, సీపీ శంఖబ్రత బాగ్చి

విద్యార్థుల ఉరుకులు.. పరుగులు

నగరంలోని రెండు కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్



పరీక్ష కేంద్రం వద్ద సీట్లు కేటాయించిన గదుల వివరాలు చూసుకుంటున్న అభ్యర్థులు

పెందుర్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. చినముషిడివాడలో రెండు పూటలా జరిగిన పరీక్షకు సుమారు 225 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

కాగా, ఐదుగురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. అనకాపల్లి, తగరపువలస, భీమవరం, గాజువాక నుంచి వచ్చిన విద్యార్థులు నిర్వాహకులను వేడుకున్నా ఫలితం లేక వెనుదిరిగారు. పరీక్షాకేంద్రానికి పార్కింగ్ లేక బీఆర్టీఎస్ రహదారి పక్కగా వాహనాలు నిలిపివేశారు.

ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు నో ఎంట్రీ

అక్కిరెడ్డిపాలెం : షీలానగర్ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వాహకులు ఉదయం 8.30 గంటలకే గేటు మూసివేయగా.. 8.45కు శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన ఎ.దిలీప్ వచ్చినప్పటికీ ఆధార్ కార్డు తేకపోవడంతో అనుమతించలేదు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు వాట్సాప్ ద్వారా ఆధార్ కార్డు పంపినప్పటికీ నిర్వాహకులు అందుబాటులో లేక ఆవేదనకు గురయ్యాడు. 8.53 గంటలకు అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన దుర్గాప్రసాద్ చేరుకున్నాడు. పరీక్షకు అనుమతించాలని పెద్దగా కేకలు వేసినప్పటికీ నిర్వాహకులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 గంటల తర్వాత సెక్యూరిటీ వచ్చి ఎవరినీ అనుమతించమని హిందీలో చెప్పి వెళ్లిపోవడంతో ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులతో పాటు ఇతర అభ్యర్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు.



లోపలకు అనుమతించకపోవడంతో నిరాశలో అభ్యర్థులు



పరీక్ష కేంద్రం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సంపత్‌కుమార్ సేవలు ప్రశంసనీయం

బదిలీపై వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్‌కు ఆత్మీయ వీడ్కోలు



కమిషనర్ సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న మేయర్, ఫ్లోర్ లీడర్లు, అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సమర్థవంతమైన పాలనతో కొద్ది కాలంలో ప్రజల మన్ననలు అందుకున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను విశాఖ ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి సీడీఎమ్‌ఏగా బదిలీపై వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అన్ని విభాగాలను సమన్వయపరుస్తూ నగరాభివృద్ధికి సంపత్‌కుమార్ కృషి చేశారన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ సంపత్‌కుమార్ సేవలను కొనియాడారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో కమిషనర్‌గా పనిచేసిన ఆరు నెలల కాలం ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్టీఎస్ నిర్వాసితుల సమస్యలపై వినతి

సింహాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కార్పొరేటర్ పీవీ నరసింహం కోరారు.బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీని కలిసి వినతిపత్రం అందించారు. కారిడార్ ఫేజ్-2 పనులు ప్రారంభమై ఏడాది కావస్తున్నా.. ఇప్పటివరకు నిర్వాసితుల్లో కొందరికి టీడీఆర్‌లు అందలేదని చెప్పారు. అలాగే ఇచ్చిన టీడీఆర్ చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కృష్ణా కళాశాల ఆవరణలో 'రెవెన్యూ' హల్‌చల్

- ఆరు సెంట్లు యూఎల్సీ భూమి ఉందంటూ హెచ్చరిక బోర్డు
- గతంలో ఇదే స్థలాన్ని కళాశాలదిగా పేర్కొన్న అధికారులు
- తాజాగా.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు వచ్చిందంటూ హడావిడి



కృష్ణా కళాశాలఆవరణలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన బోర్డు

మద్దిలపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం రెవెన్యూ శాఖాధికారులు హడావుడి చేశారు. కళాశాల ఆవరణలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) భూమి ఉందంటూ కొలతలు వేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆరుసెంట్లు స్థలం ప్రభుత్వ భూమిగా పేర్కొంటు ఆ భూమిలో అనుమతి లేకుండా ప్రవేశించినా, ఆక్రమించినా శిక్షార్హులని పేర్కొన్నారు. అయితే 5 ఎకరాల స్థలంలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేశారు. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. ప్రహరీ నిర్మాణం చేసే ముందు మూడు దఫాలు రెవెన్యూ శాఖకు తమ స్థలం సర్వే చేయాలని దరఖాస్తు చేశారు. మూడు దఫాలు రెవెన్యూ సర్వేయర్ సర్వే చేసి కళాశాల స్థలమని నివేదిక అందించిన తర్వాతే ప్రహరీ నిర్మాణం చేశారు. అంతేకాకుండా కళాశాల స్థలాన్ని హద్దులతో సహా మ్యాపింగ్ చేశారు.

ఇప్పుడు హఠాత్తుగా రెవెన్యూ సిబ్బంది కళాశాల ప్రాంగణంలో హెచ్చరిక బోర్డు పెట్టడంతో కళాశాల యాజమాన్యం ఖంగుతింది. ప్రహరీ లోపల ప్రభుత్వ భూమని బోర్డు ఏర్పాటు చేయడంపై రెవెన్యూ సిబ్బందిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకున్నామని వారు బదులివ్వడంతో మిన్నకుండిపోయారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం : ప్రిన్సిపాల్

దీనిపై జిల్లా కలక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. కళాశాలలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంపై అర్బన్ తహశీల్దారు రమేష్‌ను వివరణ కోరగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. ఫిర్యాదు మేరకు సర్వే చేసి ఆరుసెంట్లు కళాశాలలో ఉందని గుర్తించి బోర్డు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అయితే కళాశాల పక్కనే ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఓ కార్పొరేటర్ భర్త స్కూల్ నిర్మాణం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు ఆక్రమణపై చర్యలు చేపట్టని అధికారులు ప్రభుత్వ కళాశాలలో రెవెన్యూ భూమి ఉందని ఆగమేఘాల మీద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

సర్వీస్ ప్రొవైడర్లకు జోన్-2 అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) శ్రీరామ్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీరామ్

ఆరిలోవ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సర్వీసు ప్రొవైడర్లుసద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జోన్-2 అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ, మెప్మా, హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన సర్వీసు ప్రొవైడర్లకు తోటగరువు కల్యాణ మండపంలో మేళా నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ అనంతరం హోం ట్రయాంగిల్ సంస్థ యాప్ ద్వారా సేవలు అందించాల్సిన ప్రాంతాల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్, విద్యుత్ సేవలు, ఉపకరణాలు (వీటిలో ఏసీ, రిఫ్రిజిరేటర్/ వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫైయర్, గీజర్)., బ్యూటీషియన్ అంశాల్లో సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఈ మేళాకు వివిధ వృత్తులకు ంబంధించి 126 మంది సర్వీసు ప్రొవైడర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, నేతలు ఒమ్మి పోలారావు, తురకపూడి బాలస్వామి, మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలల వికాసంపై శిక్షణ



బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర బాలల వికాసంపైసచివాలయం ఉద్యోగులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, హైస్కూల్ నోడల్ ఆఫీసర్ల బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణి మాట్లాడుతూ కిశోర బాలల్లో నైపుణ్యాలను పెంచడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ జయదేవి మాట్లాడుతూ కౌమార దశలో శారీకంగా, మానసికంగా వచ్చే మార్పులు, బాల్య వివాహాల నిర్మూలన, చెడు వ్యసనాలకు లోను కాకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీ డీఓ ఎన్. హనుమంతరావు, భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాశ్‌రావు, ఎంఈవో మానేపల్లి శివరాణి, హెచ్‌ఎం మురళీమోహన్, డాక్టర్ కల్యాణి, ఐసీడీఎస్ సీడీపీఓ ఎం. శ్రీదేవి, సూపర్‌వైజర్లు జె.రేఖావాణి, ప్రమీలా, అనిత తదితరులు పాల్గొన్నారు.

హిందీ ప్రతిభా పరీక్షల్లో కేజీబీవీ బాలికల ప్రతిభ



బాలికలతో విద్యాలయం ఉపాధ్యాయులు

పద్మనాభం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం కేజీబీవీ బాలికలు హిందీ ప్రతిభా పరీక్షల్లో 12 పతకాలు సాధించారు. దశ మండం విద్యా సేవా సదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మెరిట్ సర్టిఫికెట్‌లతో పాటు అయిదుగురు విద్యార్థినులు బంగారు పతకాలను, ఏడుగురు వెండి పతకాలు పొందారు. బాలికలను, హిందీ ఉపాధ్యాయిని ఎన్. కోమలిని ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, డీఈఓ ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖర్, జీసీడీఓ కాలేషాబేగం అభినందించారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు క్షమాపణలు చెప్పాలి

- విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్
- కార్పొరేట్ కంపెనీలకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శ



ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు

సిరిపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కార్మికులు, ఉద్యోగులను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వెంటనే క్షమాపణలు చెప్పాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మథరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు కార్మికులు ఇష్టం లేకపోతే ఉద్యోగాలకు రాజీనామా చేసి వీఆర్ఎస్ తీసుకొని బయటకు పోవాలంటూ విష్ణుకుమార్‌రాజు మాట్లాడడడం ఎంతమాత్రం తగదన్నారు. ఎమ్మెల్యే కార్పొరేట్ సంస్థల ప్రతినిధిగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన వ్యాఖ్యలను జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వెంటనే ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు, కార్మికులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్‌జే అచ్యుతరావు, కె.సత్యనారాయణ, వి.కృష్ణారావు, అప్పారావు, పైడిరాజు, రామారావు, లక్ష్మి, శంకరరావు, పద్మ, సంతోష్, గణేష్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు అర్థరహితం

మద్దిలపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు క్షమాపణలు చెప్పాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలతో ప్యాకేజీ రాలేదని మా వల్లే వచ్చిందని, కార్మికుల ఆశకు అంతు ఉండాలని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించడందురదృష్టకరమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం, ప్రైవేటీకరణ చేయమని మోదీతో ప్రకటన చేయించాలని ఉత్తరాంధ్ర ప్రజలు, స్టీల్‌ప్లాంటు కార్మికులు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీపై కూటమి ప్రభుత్వంపై సానుకూలత రాకపోవడంతో ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

బీఎస్పీ పటిష్ఠానికి కృషి

ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఒక్క పరంజ్యోతి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పరంజ్యోతి, బీఎస్పీ నేతలు

వెంకోజీపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఒక్క పరంజ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం 15వ వార్డులోని కొండవాలు ప్రాంతం అంబేడ్కర్‌నగర్‌లో పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పరంజ్యోతి మాట్లాడుతూ పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

ఈ సందర్భంగా పార్టీ తూర్పు నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎన్నిక చేపట్టారు. తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జిగా పెదపెంకి శివప్రసాదరావు, అధ్యక్షుడుగా ఎస్ఏ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షులుగా ధర్మాన వాసు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కొండలరావు, కన్వీనర్‌గా ఎం.రత్నం ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి భీమరశెట్టి విశ్వనాథం, రాష్ట్ర కార్యదర్శి ఎన్ఏడీ పాల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గవర జగ్గయ్యపాలెం సమీపంలో బుధవారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గవర జగ్గయ్యపాలెం సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన బుధవారం గుర్తు తెలియని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఉన్నట్టు స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందచేశారు. దువ్వాడ రైల్వే ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకునికి అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా.. అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సుమారు 30 ఏళ్ల గల ఈ యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడు బ్లాక్ టీషర్టుపై బ్రౌన్ కలర్ స్వెటర్, బ్లూ జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని, ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 7382058996 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ లక్ష్మి తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూలో పలు విభాగాలను సందర్శించిన రెక్టార్

వెంకోజీపాలెం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఏయూ రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు బుధవారం విశ్వవిద్యాలయంలో గల విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లీష్, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, సంస్కృతం, ఆంత్రోపాలజీ తదితర విభాగాలను సందర్శించారు. ఆయా తరగతులు జరుగుతున్న తీరును నేరుగా పర్యవేక్షించారు. ఆయా విభాగాలలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీ ఎస్ఎస్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాస్, ఏఈ హైమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, కామాక్షినగర్, సీఐడీ కార్యాలయం, జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాక్‌లు, శ్రీకాంత్‌నగర్ లే అవుట్, కనకమహాలక్ష్మి నగర్, రాజీవ్‌నగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్, టీఐసీ పాయింట్, ఆరిలోవ ఆఖరి బస్టాప్, పాండురంగాపురం, నెహ్రూనగర్ దుర్గా బజార్, వెర్నీ దుర్గా బజార్, లక్ష్మీనగర్, శివాజీ నగర్, ప్రగతి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

అలరిస్తున్న విదేశీ పక్షులు



జూ సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణ

(ఆరిలోవ, ఆంధ్రజ్యోతి)

ఎక్కడో టీవీల్లోనో... సినిమాల్లోనూ అరుదుగా దర్శనమిచ్చే అరుదైన జాతి పక్షులు ఇప్పుడు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు వచ్చేశాయి. వివిధ దేశాల నుంచి జంతు మార్పిడి పద్ధతిలో సుమారు పది రకాల పక్షులను ఇక్కడకు తీసుకువచ్చి సందర్శకుల వీక్షణకు వీలుగా మోటులో ఉంచడంతో అవి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

- జంతు మార్పిడి పద్ధతిలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు తెచ్చిన అధికారులు
- సుమారు పది రకాల జాతి పక్షులకు స్థానం
- ముచ్చటగొలిపే వర్ణాలు... మనసుకు హాయి గొలిపే కిలకిలారావాలు

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో ప్రత్యేకంగా అద్దాలతో తీర్చిదిద్దిన మోటుల్లో సుమారు పది రకాల విదేశీ పక్షులకు చోటు కల్పించారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా నిర్మించిన మోటులు వీక్షకులు లోపల ఉన్న పక్షులు మరింత చక్కగా కనిపించేలా తీర్చిదిద్దారు. వీటిలోని పక్షులను తిలకిస్తున్న సందర్శకులు ఫైమరచిపోతున్నారు. విదేశీ జాతులు కావడంతో వీటికి రెండు పూటలా తగిన ఆహారం అందించడంతో పాటు ప్రత్యేకంగా వైద్యుల పర్యవేక్షణలో సంరక్షిస్తున్నారు. దక్షిణ అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో ఎక్కువగా నివసించే ఈ పక్షులను గుజరాత్‌లోని జంతు ప్రదర్శన శాలలు, పక్షుల సంరక్షణ కేంద్రాల నుంచి ఇక్కడికి తీసుకువచ్చారు.



స్కార్‌లెట్ మకావ్ పక్షులు

గ్రీన్ వింగ్‌డ్ మకావ్



ఈ రకం రెండు ఆడ, రెండు మగ పక్షులున్నాయి. ఇవి ఎక్కువ వర్షపాతం నమోదయ్యే దక్షిణ మధ్య అమెరికాలో నివసిస్తాయి. వీటిని గుజరాత్‌లోని రిలియన్స్ వంతర్ ప్రైవేటు ఫాం, రాధాకృష్ణ టెంపుల్ వెల్ఫేర్ నుంచి ఇక్కడికి జంతు మార్పిడి పద్ధతిలో తీసుకువచ్చారు. వీటి జీవిత కాలం సుమారు 60 నుంచి 80 సంవత్సరాలు. రెండు నుంచి మూడేళ్ల వయసులో ఎదకు వస్తాయి. ఒక్కో పక్షి సుమారు నాలుగు గుడ్లు పెడుతుంది. 30 రోజులు పొదుగుతుంది. పిల్లలకు ఆరునెలలు వచ్చే వరకు వెంట తిప్పుకుంటుంది. ప్రధానంగా వేరుశనగ కాయలు, వాల్ నట్స్ వివిధ రకాల విత్తనాలు, పుచ్చకాయలు, జామ పండ్లు, ఆపిల్, కొబ్బరి నూనె ఆహారంగా స్వీకరిస్తాయి. కొబ్బరికాయను ముక్కుతో పొడుచుకుని మరీ నీరు తాగుతుంది.సాధారణంగా దీని చర్మం రంగు పాలిపోతున్న సమయంలో వీటికి కొబ్బరినూనెను ఇస్తారు. బ్రీడింగ్ కోసం రంపపు పొట్టును బాక్స్‌లో వేసి ఉంచుతారు.

బ్లూ గోల్డ్ మకావ్



ఇక్కడి జంతు ప్రదర్శన శాలలో మగవి రెండు, ఆడవి రెండు ఉన్నాయి. వర్షాభావ ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా నివసిస్తాయి. పండ్లు, గింజలు, ఆపిల్, వాల్‌నట్స్, జామ, అరటి పళ్లు, ఇతర సీజనల్ ఫ్రూట్స్ అందిస్తారు. ఇవి వేరు శనగకాయలను పొడుచుకొని తినడం వల్ల కొంత ఎక్సర్ సైజు జరుగుతుంది. వీటి జీవితకాలం 50 సంవత్సరాలు. ఇవి కూడా నాలుగు గుడ్లు పెడతాయి. నెల రోజులు పొదుగుతాయి.

స్కార్ లెట్ మకావ్



మూడు ఆడ, మూడు మగ ఉన్నాయి. వీటి జీవిత కాలం 40 ఏళ్లు. వీటిని ఆలీపుర్ జూ నుంచి తీసుకు వచ్చారు. వీటి ఆహారం మునగ ఆకు, వేపాకుతో పాటు వేరు శనగకాయలు, జామ ఆపిల్, కీరా దోశ.

మిలటరీ మకావ్



రెండు మగవి రెండు ఆడ పక్షులున్నాయి. వీటిని గుజరాత్‌లోని రాధాకృష్ణ టెంపుల్ వెల్ఫేర్ నుంచి తీసుకువచ్చారు. ఇవి సాధారణంగా దక్షిణ మధ్య అమెరికాలో ఉంటా యి. వీటి జీవితకాలం 60 సంవత్సరాలు. వీటిని కొంతమంది పెంచుకోవడానికి తీసుకుపోతుండడంతో వీటి జాతి అంతరించిపోయే దశకు చేరుకుంది.

సల్ఫర్ క్రిస్టడ్ కకోట్



ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో ఐదు పక్షులున్నాయి. వీటిలో మూడు మగ, రెండు ఆడ. వీటి జీవితకాలం 100 సంవత్సరాలు. ఇవి ప్రధానంగా పరుగులు, గింజలు, పండ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పాటు ఆసియా ఖండంలో ఎక్కువగా నివసిస్తాయి. వీటిని కూడా గుజరాత్ నుంచి ఇక్కడికి తీసుకువచ్చారు.

జెండ్యా కానూర్

ఒక మగ ఒక ఆడ, మూడు పిల్లలు ఉన్నాయి. బ్రెజిల్‌లో ఎక్కువగా ఉంటాయి. జీవితకాలం 30 ఏళ్లు. నాలుగు గుడ్లు పెట్టి పొదుగుతాయి. ఆకుకూరలు, పండ్లు, జామ, దోస, పుచ్చకాయలు ఆహారం. వీటి గదుల్లో అతి ఎక్కువగా సూక్ష్మక్రిములు వ్యాపిస్తాయి. అందువల్ల ఏడాదికి ఇకసారి సుమారు మూడు అంగుళాల మేర మట్టిని తొలగించి, కొత్త మట్టిని వేసి గదులు సిద్ధం చేస్తారు. ఎలక్ట్రికల్ బోయర్‌తో క్రిమి నాశనం చేస్తారు.

ఎలక్టస్ పేరట్



రెండు మగ, రెండు ఆడవి ఉన్నాయి. వీటి జీవితకాలం 40 సంవ త్సరాలు ప్రతి నాలుగేళ్లకు ఎదకు వస్తాయి. ఇండోనేషియా ప్రాంతంలో విరివిగా నివసిస్తాయి. గింజలు, పండ్లు, జామ, అరటి, ఆపిల్ ఆహారంగా తీసుకుంటాయి.

ల్యూటినో పెర్కిట్



జూలో ఈ రకం పక్షులు 28 ఉన్నాయి. 15 మగ, 13 ఆడ. వీటి జీవితకాం 20 సంవత్సరాలు. వరుసగా ఏడు గుడ్లను పెడుతుంది. 21 రోజుల్లోనే పొదుగుతుంది. ఇవి పది నెలలకు ఒకసారి ఎదకు వస్తాయి. సవన్నా గడ్డి మైదానాల్లో పెరుగుతాయి. ధాన్యాన్ని, గింజలను ఆహారంగా తీసుకుంటాయి. పళ్లు కూడా తింటుంది.

ఆఫ్రికన్ గ్రే పేరట్



జూలో మగ, ఆడ రెండు పక్షులున్నాయి. వీటి జీవిత కాలం 40 సంవత్సరాలు. ఒకసారి నాలుగు గుడ్లు పెట్టి, 28 రోజులకు పొదుగుతుంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఎదకు వస్తాయి. పండ్లు, గింజలను ఆహారంగా తీసుకుంటుంది. పుచ్చకాయలు, జామ, ఆపిల్ ఇష్టంగా తింటాయి.

గోఫిన్స్ కాకొటా



ఇక్కడ ఒక జత ఉన్నాయి. నార్త్ అమెరికా ప్రాంతంలో నివసిస్తుంది. జీవితకాలం 30 సంవత్సరాలు. ఇవి కూడా నాలుగు గుడ్లను మాత్రమే పెడతాయి. 28 నుంచి 30 రోజులు పొదుగుతుంది. సీజనల్ ఫ్రూట్స్‌తో పాటు, జామ, ఆపిల్ పుచ్చ, దోస, గింజలు, నూకలు ఆహారంగా తీసుకుంటాయి.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

» ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర



ఆలయ విశిష్టతను మంత్రి కొల్లుకు వివరిస్తున్న ధర్మకర్త లక్ష్మీప్రసాద్

సాగర్‌నగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషి వల్ల దావోస్ సదస్సులో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బీచ్ రోడ్డులో కొలువై ఉన్న మొగధారమ్మ, శ్రీమహాలక్ష్మీ పద్మావతి అమ్మవార్ల ఆలయాన్ని బుధవారం మంత్రి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్త సూరపునేని లక్ష్మీప్రసాద్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కృషితో రాష్ట్రానికి పెట్టుబడిదారులు వస్తున్నారన్నారు. చంద్రబాబు ఆశయం నెరవేరాలని మంత్రి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జనసేన నాయకుడు శాఖరి శ్రీనివాస్, టీడీపీ నాయకులు బి.దొరబాబు, లొడగల రామ్మోహన్, అక్కరబోయిన రాంబాబు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

షార్జా నుంచి క్షేమంగా..

» నగరానికి చేరిన ఐదుగురు యువకులు

» చొరవ చూపిన సీపీ శంఖబ్రత బాగ్చి



నగరానికి చేరుకున్న యువకులతో సీపీ శంఖబ్రత బాగ్చి, పోలీసులు

గోపాలపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వెల్డర్ ఉద్యోగం కోసం షార్జా వెళ్లి మోసపోయి, నెలరోజులుగా ఇబ్బంది పడుతున్న ఐదుగురు యువకులు బుధవారం నగరానికి క్షేమంగా చేరుకున్నారు. వీరిని ఇక్కడికి రప్పించడానికి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవ చూపించారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాకు చెందిన పొలుపర్తి లక్ష్మణరావు (21), గార రాజేశ్ (21), పైలా రామస్వామి (21), శ్రీకాకుళం జిల్లాకు చెందినకళ్ల వెంకటరావు (25), పెదగంట్యాడకి చెందిన గెద్దాడ లోకేశ్ (24) పారిశ్రామిక ప్రాంతంలో వెల్డింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. గాజువాకకి చెందిన ఓ ఏజెన్సీ ద్వారా గత నెలలో విజిట్ వీసాపై షార్జా వెళ్లారు. అక్కడ ఏజెన్సీలో వెల్డింగ్ టెస్ట్ నిర్వహించి, హెల్పర్లుగా చేరమని చెప్పారు. వెల్డర్ ఉద్యోగం కోసం వస్తే తక్కువ జీతానికి హెల్పర్ ఎలా చేస్తామని నిరాకరించారు. ఈ మేరకు ఇక్కడి ఏజెన్సీకి సమాచారం ఇవ్వడంతో నగరానికి సొంత ఖర్చులతో రావాలని రెండు రోజుల్లో పాస్‌పోర్ట్ ఇప్పిస్తానని ఏజెంట్ చెప్పాడు. ఇరవై రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో లోకేశ్ సీపీకి ఫోన్ చేసి విషయం చెప్పాడు. స్పందించిన సీపీ ఏజెంట్‌తో మాట్లాడి తక్షణమే యువకుల్ని నగరానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీకి వారు ధన్యవాదాలు తెలిపారు.

కొట్లాటలో యువకుడికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి విషయంలో ముగ్గురు యువకుల మధ్య జరిగిన కొట్లాట ఓ యువకుడ్ని తీవ్ర గాయాలకు గురిచేసింది. వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన ఓ యువతి (20) మద్దిలపాలెంలోని ఓ పార్లర్‌లో పనిచేస్తోంది. ఆమెకు స్థానికంగా ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న వినోద్‌తో సాన్నిహిత్యం ఉంది. ఆమెతో పరిచయమున్న వెంకట్ దీనిని గమనించి ఆమె బావకు చెప్పాడు. ఈ విషయమై వెంకట్‌ను ప్రశ్నించేందుకు యువతితో పాటు ఆమె బావ, వెంకట్ మంగళవారం రాత్రి మద్దిలపాలెం రామాలయం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో వీరి మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారి తీసింది. దీంతో వెంకట్ ఇనుప ఊచతో వినోద్‌ను పొడిచారు. తీవ్రంగా గాయపడిన వినోద్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడు వెంకట్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బాలికల సదన్ వద్ద ఉద్రిక్తత

» గోడ దూకి రోడ్డుపైకి వచ్చిన ఐదుగురు బాలికలు

» మేట్రిన్ చిత్ర హింసలకు గురిచేస్తున్నారని ఆరోపణ

» 18 ఏళ్లు నిండినా ఇళ్లకు పంపడం లేదని ఆవేదన

» సర్దిచెప్పిన ఏసీపీ నరసింహమూర్తి, అధికారులు

ఆరిలోవ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 'మేట్రిన్ చిత్రహింసలను తట్టుకోలేకపోతున్నాం. మైనారిటీ తీరినా విడుదల చేయడం లేదు'...అంటూ ప్రత్యేక బాలికల పరిశీలన గృహానికి చెందిన ఐదుగురు బాలికలు గోడ దూకి రోడ్డుపైకి చేరి హడావిడి సృష్టించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హోమ్ సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు చేరుకుని బాలికలను సముదాయించారు. వివరాలిలా ఉన్నాయి.

నగరంలోని విశాఖ వేలీ స్కూల్ సమీపంలోని ప్రభుత్వ బాలికల పరిశీలన గృహం, బాలికల సదనంలో ఉంటున్న హైదరాబాద్, పశ్చిమ గోదావరి, కృష్ణా, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఐదుగురు బాలికలు బుధవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. గోడలు ఎక్కి, పెద్దపెద్ద రాళ్లను హోమ్‌లోకి విసిరారు, పైన రేకులు, పెంకులు తొలగించారు. పోలీసులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ జేడీ జయదేవి, చినగదిలి తహసీల్దార్ పాల్‌కిరణ్ చేరుకుని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలికలు మాట్లాడుతూ తమను మేట్రిన్ కుమారి చిత్ర హింసలకు గురిచేస్తోందని ఆరోపించారు. 18 సంవత్సరాల వయసు దాటినా ఇప్పటికీ ఇళ్లకు పంపకుండా హోమ్‌లోనే ఉంచడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇక్కడ నరకయాతన అనుభవిస్తున్నామని వాపోయారు. నిద్రమాత్రలు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చేయరాని పనులు చేయిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల చెంతకు చేరితేనే తమకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మేట్రిన్ పెడుతున్న హింసలను భరించలేక ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వివరించారు. కాగా బాలికల హోమ్ సూపరింటెండెంట్ సునీత మాట్లాడుతూ సుమారు 60 మంది బాలికలను కోర్టు ఉత్తర్వుల మేరకు సీడబ్ల్యూసీ (చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ) అధికారులు ఇక్కడ ఉంచారన్నారు. రోడ్డుపై అల్లరి చిల్లరగా తిరుగుతున్నవారు, తల్లిదండ్రులకు దూరమైనవారు, అల్లరి పనులు చేసిన బాలికలకు షెల్టర్ ఇచ్చామన్నారు. వారందరినీ మంచి విద్యార్థినులుగా తీర్చిదిద్ది, స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ అందిస్తున్నామన్నారు. వీరిలో నలుగురు విద్యార్థినుల మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో చికిత్స అందిస్తున్నామని వివరించారు. ఆ నలుగురు చేతులు కోసుకోవడం లాంటి పనులకు తెగించారన్నారు. ఇదిలావుండగా బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ వీరయ్య కోర్టు ఉత్తర్వుల మేరకు 18 సంవత్సరాలు నిండి వారందరినీ ఇళ్లకు పంపుతామన్నారు. దీంతో తాత్కాలికంగా సమస్య సద్దుమణిగింది.

28న జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-23 పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక ఈ నెల 28న పోలీసు బ్యారక్ బాస్కెట్‌బాల్ కోర్టులో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి భూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనేవారు 2002 జనవరి 1 లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార కార్డులతో 28వ తేదీన సాయంత్రం 4 గంటలకు పోలీసు బ్యారక్ బాస్కెట్‌బాల్ కోర్టులో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 99667 53209, 89196 49048 నంబర్లలో సంప్రతించాలన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్రం చేయూత

ఎంవోహెచ్‌యూఏ, పీఎం స్వానిధి సంయుక్త కార్యదర్శి రూపా మిశ్రా



డ్వాక్రా మహిళలతో ముచ్చటిస్తున్న రూపా మిశ్రా

మద్దిలపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తోందని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ., పీఎ స్వానిధి సంయుక్త కార్యదర్శి రూపా మిశ్రా తెలిపారు. పీఠాపురం కాలనీ పార్కులో బుధవారం ఆమె డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. డ్వాక్రా రుణాల మంజూరు తీరును పరిశీలించారు. మహిళల స్థితిగతులు, ఆర్థిక అవసరాలకు డ్వాక్రా రుణాలు ఎంతమేర ఉపయోగంగా ఉన్నాయనే అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా రూపా మిశ్రా మాట్లాడుతూ డ్వాక్రా మహిళకు మేలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో పలు పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ (పీఎంఎఫ్ఎంఈ), ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన (పీఎంఈజీపీ) పథకాల కింద రుణాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. మహిళల స్వయం ఉపాధికి పదకొండు వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి 35 శాతం రాయితీతో బ్యాంక్ రుణాలు అందిస్తున్నట్టు వెల్లడించారు. మహిళలు ఈ అవకాశాలను వినియోగించుకని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

పర్యాటక ప్రాంతాలతో డిజిటల్ లైబ్రరీ

» ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ ఆమ్రపాలి



హోటళ్ల యజమానులతో చర్చిస్తున్న ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలతో ఒక డిజిటల్ లైబ్రరీ తయారుచేసే ఆలోచన ఉందని పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ఆమె వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నగరంలోని హోటళ్ల యజమానులు, టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. నోవాటెల్ చైర్మన్ ప్రభుకిశోర్, దసపల్లా హోటల్ గ్రూపు చైర్మన్ రాఘవేంద్రరావు, ఏపీ టూరిజం ఫోరమ్ అధ్యక్షులు కె.విజయమోహన్, సెక్రటరీ ఎంవీ పవన్ కార్తీక్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.ప్రశాంత్ తదితరులతో కీలక చర్చలు చేశారు. హోటళ్లలో బార్ లైసెన్స్ ఫీజు అధికంగా ఉండడంతో వ్యాపారం సరిగ్గా జరగడం లేదని, దానిని తగ్గించాలని పలువురు కోరగా ఆమె పరిశీలిస్తామన్నారు. ఇన్‌బౌండ్ టూరిజం, బుద్ధిస్టు ప్రాంతాలు, గిరిజన పర్యాటకం ఈ ప్రాంతంలో అభివృద్ధి చేయడానికి అధికంగా అవకాశాలు ఉన్నాయని విజయమోహన్ ప్రస్తావించగా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అంతకుముందు ఆమెకు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

24న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 24న నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీరమణ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో చర్చించేందుకు 110 అంశాలతో అజెండా సిద్ధం చేశామన్నారు. 22 వార్డు పరిధి పీతలవానిపాలెంలో రూ.30 లక్షల తో జీ+1 సామాజిక భవనం, ఎన్టీఆర్ విగ్రహం నుంచి కళాభారతి మీదుగా జాతీయరహదారి వరకు రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్, డ్రైన్లు నిర్మాణానికి ప్రతిపాదించారు. 18 వార్డు పెదజాలారిపేటలో రక్షణ గోడ, ఎంవీపీకాలనీ కేన్సర్ ఆస్పత్రి నుంచి రైతుబజార్ వరకు బీటీరోడ్డు నిర్మాణం, ఐదో వార్డు నుంచి 13 వార్డు వరకు బీఆర్‌టీఎస్, జాతీరహదారి, బీచ్‌రోడ్డు పరిశుభ్రత, పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం నుంచి టీబీ ఆస్పత్రి రోడ్డు పరిశుభ్రత కోసం 150 మంది తాత్కాలిక పారిశుద్య కార్మికులను కొనసాగించడం, వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను అజెండాలో చేర్చారు. ఇటీవల ప్రధానమంత్రి పర్యటన సంద ర్భంగా ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ఏర్పాట్లకు రూ.3 లక్షలు, నేవీ మారథాన్ సందర్భంగా ఏపీఐఐసీ మైదానం చదనుకు చేసిన ఖర్చు రూ.2.5 లక్షలు చెల్లింపు, రుషికొండపై ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు రక్షణ గోడ నిర్మాణం వంటి ప్రతిపాదనలను చేర్చారు.

వీఎస్ కృష్ణ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా రేపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో 24న మద్దిపాలెంలోని వీఎస్ కృష్ణ డిగ్రీ, పీజీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. టెక్విసెన్ సాఫ్ట్‌వేర్, డబ్ల్యూఎన్ఎస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, సంగీతా మొబైల్స్, పీబీఎల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. రెడ్డీస్‌కు 2024లో ఇంటర్ ఎంపీసీ లేదా బైపీసీ పూర్తిచేసిన 18 నుంచి 20 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. టెక్విసెన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, పీబీఎల్ ట్రాన్స్‌పోర్ట్‌కు డిగ్రీ పూర్తిచేసిన యువతీ, యువకులు హాజరుకావచ్చన్నారు. సంగీతా మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఎంపికైనవారు విశాఖపట్నం, హైదరాబాద్‌లో పనిచేయాలన్నారు. వివరాలకు 9885694676 నంబరులో సంప్రతించాలని, 19 నుంచి 30 ఏళ్లలోపు వారు ఆధార్, అనుసంధాన ఫోన్ నంబరుతో హాజరుకావాలన్నారు.

కందిపప్పు పంపిణీ మూణ్నాళ్ల ముచ్చటే...!

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో రాయితీపై అందించాల్సిన కందిపప్పు సరఫరా మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. వచ్చే నెలలో బియ్యం, పంచదార మాత్రమే అందజేయనున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఐదు నెలల వరకు బియ్యం, మధ్యలో పంచదార అందించారు. గత ఏడాది నవంబరు నుంచి కందిపప్పు కిలో రూ.67కు విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.160 నుంచి రూ.170లకు విక్రయిస్తుండంతో రేషన్‌లో డిమాండ్ పెరిగింది. జిల్లాలో 5.29 లక్షల కార్డుదారులకు ఫిబ్రవరిలో 530 టన్నుల కందిపప్పు అవసరం. కానీ పౌరసరఫరాల సంస్థ హోల్‌సేల్‌గా మిల్లర్ల నుంచి కొనుగోలు చేయకపోవడంతో సరఫరాచేయలేదు. జిల్లాలో జనవరిలో సరఫరాచేయగా 60 టన్నుల నిల్వ ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు 35 టన్నులు అవసరం. ప్రస్తుత నిల్వను వాటికి సరఫరా చేయనున్నారు. ఫిబ్రవరిలో బియ్యం ఎనిమిదివేల టన్నులు, 265 టన్నుల పంచదార కేటాయించి డిపోలకు పంపిణీ ప్రారంభించినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు సరిత పేర్కొన్నారు.

హౌసింగ్ అధికారుల తీరుపై ఎండీకి ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారు సెంటు స్థలం లేఅవుట్‌లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు గాను వైసీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకు విశాఖలో హౌసింగ్ అధికారులు పెద్దపీట వేస్తున్నారని చిన్న కాంట్రాక్టర్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీకి ఫిర్యాదుచేశారు. గత పాలకుల దన్నుతో భారీగా ఇళ్లు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు హవా కొనసాగిస్తున్నారన్నారు. ముదపాక రెండు లేఅవుట్‌లలో సుమారు 1560 ఇళ్ల పనులు చేపట్టిన కాంట్రాక్టరును తప్పించి వైసీపీ నేత అనుచరుడికి అప్పగించారన్నారు. ఇందులో కోర్టు వివాదంతో రెండేళ్లుగా పనులు నిలిచిపోయిన 684 ఇళ్లున్నాయన్నారు. మిగిలిన లేఅవుట్‌లలో చిన్న కాంట్రాక్టర్లకు ఇసుక సరఫరాలో వివక్ష చూపుతున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.